# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 58 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 19 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 58 19-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-





శుభ ముహూర్తాలు కొన్నే..
ఫంక్షన్ హాళ్లకు పెరిగిన గిరాకీ

2లో..

## మోదీ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

### -మంత్రులతో కమిటీ



అమరావతి ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం ప్రధాని మోదీ అమరావతిలో రాజధాని పనుల పునః ప్రారంభం కోసం వస్తున్న సంగతి తెలిసిందే. మోదీ పర్యటన విజయవంతంగా సాగేందుకు మంత్రులతో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నాడు ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లు, నిర్వహణకు మంత్రులతో కమిటీ ప్రకటించింది. ఈ నిర్వహణ కమిటీలో నారా లోకేష్, పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర సభ్యులుగా ఉంటారు. ప్రధాని పర్యటనకు నోడల్ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్?ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శంకుస్థాపనలు, పెట్టుబడుల ప్రారంభోత్సవం కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. రాజధానిలో నిర్మాణాల ప్రారంభం కోసం ప్రధాని మే 2న ఏపీ వస్తున్నందున ఈ నెల 28లోపు ప్రధాని పర్యటన

- తరువాయి 2లో..

## టెక్నాలజీలో అమెరికాతో..

# ద్వైపాక్షిక భాగస్వామ్యం

### ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ భేటీ




న్యూఢిల్లీ ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో మాట్లాడారు. టెక్నాలజీ, ఆవిష్కరణ రంగాలలో సహకారం గురించి చర్చించారు. దీనికి సంబంధించి పీఎం మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్ డిసిలో జరిగిన మా సమావేశంలో చర్చించిన అంశాలతో సహా వివిధ సమస్యలు, అంశాల గురించి ఎలాన్ మస్క్‌తో మాట్లాడాను. టెక్నాలజీ, ఇన్నోవేషన్స్ రంగాలలో సహకారానికి ఉన్న అపారమైన

- తరువాయి 2లో..

## ప్రతినెల 3వ శనివారం ఏపీలో ..

# 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'



ఒక్కో నెల ఒక్కో థీమ్

ఈసారి 'ఈ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం' థీమ్

'స్వచ్ఛ ఆంధ్ర' ఏప్రిల్ నెల థీమ్ ను వెల్లడించిన సీఎం చంద్రబాబు

అమరావతి ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. ప్రతి నెల 3వ శనివారం రోజున రాష్ట్రవ్యాప్తంగా 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందుకోసం వివిధ థీమ్ లను అనుసరిస్తున్నారు. ఏప్రిల్ నెల థీమ్ ను తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "స్వర్ణాంధ్ర-2047

- తరువాయి 2లో..

## విత్తన కంపెనీల మోసాలు

# పన్ను ఎగవేత



అమరావతి, హైదరాబాద్ ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వానాకాలం సాగు సమీపిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విత్తన కంపెనీలు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నాయన్న ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. రైతుల పేర్లను ఉపయోగిస్తూ, వాస్తవానికి తాము చేసిన విత్తన ఉత్పత్తులను రైతుల నుండే తయారయ్యినట్లుగా చూపి, ఆయా కంపెనీలు భారీగా ఆదాయపు పన్నును ఎగవేస్తున్నట్లు సమాచారం. ఈ మోసాల పరిమాణం దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకు ఉన్నట్లు అంచనా వేయబడింది.విస్తృతమైన వ్యవసాయ భూములు, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ, అమాయక రైతులు అనే ఈ మూడు అంశాలను విత్తన కంపెనీలు తమ లాభాల కోసమే వాడుకుంటున్నాయి. రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులు కొని, ఆ ఉత్పత్తుల ఆధారంగా విత్తనాలను తయారు చేస్తున్నట్లు కంపెనీలు చూపుతున్నాయి. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా వందలాది విత్తన కంపెనీలు ఈ తరహా కార్యకలాపాలకు

- తరువాయి 2లో..



# అడవుల్లో కాల్పుల మోత

## మావోలు హతం

ఛత్తీస్‌గడ్ ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాల కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు వర్గాల సమాచారం. సంఘటన స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కోహ్కామెటా పోలీస్ స్టేషన్ పరిధిలోని కసోద్ - కుమురాడి అడవిలో భద్రతాబలాగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. ఇటీవల కాలంలో ఆపరేషన్ కగార్ దూకుడుగా ఉంది. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి. గత 50ఏళ్లుగా కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమం కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఓ లేఖ

- తరువాయి 2లో..

## బెట్టింగ్ యాప్‌లకు..

# అడ్డుకట్ట..

త్వరలోనే ఓ పాలసీ : మంత్రి లోకేశ్

నా అన్వేషణ అన్వేష్ వీడియోపై స్పందించిన లోకేష్ బెట్టింగ్ యాప్‌లపై కఠిన చర్యలు

అమరావతి ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బెట్టింగ్ యాప్స్ మాయలోపడి ఇప్పటికే ఎంతో మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోయారు.. ఇంకా ఇది కొనసాగుతూనే ఉంది.. ఈజీగా మని సంపాదించవచ్చు అనే ఆశతో.. బెట్టింగ్ యాప్స్‌ను ఆశ్రయిస్తున్న యువత.. అప్పుల్లో కూరుకుపోయి.. పేరెంట్స్

- తరువాయి 2లో..



# సిట్ ముందుకు సాయిరెడ్డి

విజయవాడ ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణం దర్యాప్తును సిట్ వేగవంతం చేసింది. వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సిట్ ముందు హాజరయ్యారు. విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిట్ అధికారుల ఎదుట సాయి రెడ్డి విచారణకు వెళ్లారు. లిక్కర్ కుంభకోణం కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వబోతున్నారు. మరోవైపు లిక్కర్ స్కాంలో కీలక నిందితుడైన రాజ్ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి వరుసగా రెండో రోజు విచారణకు వెళ్లారు. ఆయనతో పాటు రాజ్ సహాయకుడి తండ్రిని కూడా అధికారులు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా రెండు గంటల సమయంలో సిట్ ముందుకు వచ్చారు మాజీ ఎంపీ. భోజన విరామం అనంతరం సిట్ ముందుకు వస్తానని విజయసాయి ముందుగానే సిట్ అధికారులకు సమాచారం పంపారు. అందులో భాగంగా సరిగ్గా 2 గంటలకు సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. వేల కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించేలా చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ మొత్తం వ్యవహారానికి కర్త, కర్మ, క్రియ రాజ్ కసిరెడ్డే అంటూ గతంలో విచారణకు వచ్చిన సందర్భంలో విజయసాయి చెప్పిన విషయం తెలిసిందే. తనను ఎన్ని సార్లు విచారణకు పిలిచినా అదే విషయాన్ని చెబుతానని చెప్పారు కూడా.

- తరువాయి 2లో..

## కొత్తగా నియమితులైన మహిళా ఉద్యోగులకు

# ప్రసూతి సెలవులు




అమరావతి ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త అందింది. కూటమి సర్కార్ మాతృత్వ హక్కులకు గౌరవం ఇస్తూ, ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే ప్రసూతి సెలవుల ప్రయోజనం వర్తించేది. అయితే ఇప్పుడు కొత్తగా నియమితులైన మహిళా ఉద్యోగులు కూడా ప్రసూతి సెలవులు తీసుకున్నా, వారి ప్రొబేషన్‌పైన ఎలాంటి ప్రభావం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం

- తరువాయి 2లో..

## గిరిజనులకు

# చెప్పుల పంపిణీ

### గొప్ప మనసు చాటుకున్న పవన్ కల్యాణ్

పాడేరు ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అల్లూరి జిల్లాలో ఎక్కువగా గిరిజనులు ఉండే గ్రామం పెదపాడు. ఈ గ్రామంలో ఎంతో మంది గిరిజనులు నివసిస్తున్నారు. వారికి కనీసం పాదరక్షలు కూడా లేకుండా నడుస్తున్నారు. ఈ క్రమంలో

2లో..








## జీసస్ త్యాగం ఒక మానవతా మార్గదర్శకం : జగన్

అమరావతి ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత పవిత్రమైన గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ సందర్భంలో వైఎస్సార్సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తన మనోభావాలను వ్యక్తం చేశారు. మానవాళి శ్రేయస్సు కోసం ఏసు క్రీస్తు చేసిన త్యాగం ఈ రోజున మనకు గుర్తుకువస్తుందని జగన్ పేర్కొన్నారు. జీసస్

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# నేపాల్ పరిణామాలకు బాధ్యులెవరు?

**మహారాజు జ్ఞానేంద్రకు మద్దతుగా నేపాల్లో ఏదో ఒక ప్రాంతంలోఆందోళనలు సాగుతూనే ఉన్నాయి. ఇవి నేపాల్లో ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మార్చ్ 28వ తేదీన ఇవి ఘర్షణ స్థాయికి చేరి ఇద్దరు వ్యక్తులు మరణించగా అనేకమంది గాయపడ్డారు. ప్రభుత్వ ఆస్తులకు భారీగా నష్టం వాటిల్లింది. ఇందుకు మహారాజు, ఆయన మద్దతుదారులు బాధ్యులని ప్రభుత్వం ఆరోపించింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినందుకు రాజు 8 లక్షల రూపాయల జరి మానా చెల్లించాలని కూడా ఆదేశించింది. దీన్ని ప్యాలెస్ఖండించింది. మరోవైపు ప్రభువు మద్దతుదారులంతా నిధులు సేకరించి సొమ్ము చెల్లించటానికి సిద్ధమవుతున్నారు.**

ఒకప్పుడు రాచరికాన్ని కాదనుకున్న నేపాలీ సమాజం ఇప్పుడు రాజుకు ఎందుకు మద్దతు పలుకుతోంది? ఇందుకు నేపాల్ పాలకుల తీరే కారణం. 2008లో నేపాల్లో రాచరికం రద్దయిన తర్వాత 17 ఏళ్ల కాలంలో 18 ప్రభుత్వాలు నేపాల్ను పాలించాయి. ఏ ఒక్క ప్రభుత్వం కూడా సజావుగా పాలించిన రికార్డు లేదు. అవసరార్థం సర్దుబాట్లు చేసుకుని సంకీర్ణ ప్రభుత్వాలను నడిపారు. ఇప్పటి కేపీ ఓలి, షేర్ కుమార్ దుబా, ప్రచండ... ఇలా ప్రధానులంతా తీవ్ర అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్న వారే. రాజకీయ అస్థిరత ఒకవైపు, అవినీతి మరోవైపు నేపాల్ను దారుణంగా దెబ్బతీశాయి. ఆర్థిక వ్యవస్థ దారు

ణంగా దెబ్బతింది. ఉపాధి అవకాశాలు తగ్గి పోయాయి. యువత దేశాన్ని వదిలి ఉపాధి కోసం బయట దేశాలకు వెళు తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజు మళ్లీ అధికారం చేపట్టాలని కోరుకుంటున్న వాళ్ల సంఖ్య పెరుగుతోంది. రాచరికాన్నిరద్దు చేయటం వల్ల నేపాల్ సార్వభౌమాత్వానికి దెబ్బ తగిలిందనీ, తిరిగి రాజు అధికారం చేపడితే ప్రపంచ దేశాల్లో నేపాల్ గుర్తింపు సంపాదిస్తుందని భావిస్తున్న వాళ్లు కొందరు ఉన్నారు.

మరొక అంశం 'హిందూత్వ'. నేపాల్ను హిందూ స్టేట్గా మార్చాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఇందుకోసం తెరవెనక ప్రయత్నాలు సాగుతున్నాయి. మహరాజు జ్ఞానేంద్ర ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్తో భేటీ కావటం, ఆయన ఫొటోలు నేపాల్ వీధుల్లో దర్శనం ఇవ్వటం వంటి ఇటీవల పరిణామాలు దీనికి బలాన్ని ఇస్తున్నాయి. అల్లర్ల వెనక భారత్ ఉందని నేపాల్ ప్రభుత్వం ఆరోపించటానికి ఇది కూడా ఒక కారణమని మనం భావించవచ్చు.

ప్పుడు చెలరేగుతున్న ఆందోళనలు రానున్న రోజుల్లో ఎటు దారితీస్తాయో తెలి యదు. నేపాల్లో ఆందో ళనలకు రాష్ట్రీయ ప్రజా


తంత్ర పార్టీ నాయకత్వం వహిస్తున్నా, ఇందులో అసాంఘిక శక్తులతో పాటు చైనా పాత్రను కొట్టేయలేం. చాలా కాలంగా చైనా ఆధ్వ ర్యంలో నేపాల్లో భారత్ వ్యతిరేక కార్యక్రమాలు సాగుతున్నాయి. దీనికి కమ్యూనిస్టు ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. సరిహద్దులో ఆగడాలను చూసీ చూడకుండా వదిలేస్తోంది. భారత్తో సంబంధాలు దెబ్బ తిన్నప్పుడు రాజు జ్ఞానేంద్ర చైనాతో స్నేహంగా మసిలిన మాట నిజమే. అలాగని ఆయనకు ఇప్పుడుచైనా మద్దతుగా ఉంటుందని భావించలేం. నేపాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని యూఎస్, యూకే, ఇండి యాలు గుర్తిస్తున్నాయి. ప్రజాపాలన నుంచి రాచరికంలోకి మారినంత మాత్రాన నేపాల్ అభివృద్ధి ఫలాలను అందుకుంటుందని చెప్పలేం. రాజు అధికారంలోకి వస్తే అన్నీ సర్దుకుంటాయన్న భావన తార్కికంగా సమంజసంగా లేదు. మార్పు మంచిదే. అదీ అభివృద్ధికి తోవ చూపించినప్పుడే కదా?

# పెళ్లి సందడి

- శుభ ముహూర్తాలు కొన్నే..
- ఫంక్షన్ హాళ్లకు పెరిగిన గిరాకీ
- కళకళలాడుతున్న పెళ్లి మండపాలు
- కుదిరిన ముహూర్తంలోనే పెళ్లికి తొందర
- జూన్లో నాలుగే ముహూర్తాలు
- ఆగస్టు-సెప్టెంబర్లో శూన్యమాసం

**అమరావతి ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఈ ఏడాది చైత్ర, వైశాఖ, జ్యేష్ట మాసాల్లో శుభ ఘడియలు కొన్ని మాత్రమే ఉండటంతో కుదిరిన ముహూర్తంలో పెళ్లి చేసేయాలని పెద్దలు నిర్ణయం తీసుకుంటున్నారు. ఫలితంగా ఉభయ తెలుగు రాష్ట్రాలూ పెళ్లి కళను సంతరించుకున్నాయి. ఈ నెల 12న శుభ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. 18, 20, 23, 30 తేదీల్లో ఇంకా ముహూర్తాలు మిగిలి ఉన్నాయి. అలాగే, మే ఒకటో తేదీ నుంచి 28 మధ్య 11 ముహూర్తాలున్నాయి. ఆ తర్వాత జూన్లో నాలుగంటే నాలుగే ముహూర్తాలున్నాయి. ఆగస్టు–సెప్టెంబర్లో శూన్యమాసం వస్తుండటంతో నెల రోజులపాటు పెళ్లి మండపాలు, ఫంక్షన్ హాళ్లు బోసిపోనున్నాయి. ఆ తర్వాత సెప్టెంబర్లో మంచి రోజులు కొన్ని మాత్రమే ఉన్నాయి. ఈ ఏడాదికి ఇవే ముహూర్తాలు కావడంతో ఫంక్షన్ హాళ్లకు గిరాకీ పెరిగింది.



## మోదీ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సభా ప్రాంగణం కోసం 100 ఎకరాలు, పార్కింగ్ కోసం 250 ఎకరాలు సిద్ధం చేసి, సభా ప్రాంగణంలో సుమారు 5 లక్షల మంది కూర్చునేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఇప్పటికే సిబ్బంది మొత్తం 10 బుల్డోజర్లతో సభాస్థలిని చదును చేస్తున్నారు. సభా ఏర్పాట్లను శుక్రవారం నాడు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు.

## టెక్నాలజీలో అమెరికాతో.. ద్వైపాక్షిక భాగస్వామ్యం

అవకాశాలపై మేము చర్చించాం" అని మస్క్ యాజమాన్యంలోనే ఉన్న సోషల్ మీడియా ప్లాట్ఫామ్ %ఆ%లో పీఎం మోదీ పోస్ట్ చేశారు. టెక్నాలజీలో అమెరికాతో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భారతదేశం కట్టుబడి ఉందని మోదీ అన్నారు. కాగా, 2030 నాటికి 500 బిలియన్ల డాలర్ల వాణిజ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో భారత్ – అమెరికా ప్రతిష్టాత్మక ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కు ప్రముఖ సలహాదారన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా, వాషింగ్టన్లో టెస్లా చీఫ్ను కలుసుకుని ఇండియాలో టెస్లా స్థాపనకు సంబంధించిన అంశాలతోపాటు సాంకేతికత, నూతన ఆవిష్కరణలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. ఇలా ఉండగా, ప్రపంచంలోనే ప్రముఖ ఈవి తయారీదారైన టెస్లా భారతదేశంలోకి ప్రవేశించడానికి రంగం చకచకా సిద్ధమవుతోంది, భారత దిగుమతి విధానాల కారణంగా చాలా కాలంగా మస్క్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆటో మార్కెట్ అయిన భారత్కు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు ఆ కల సాకారం కాబోతోంది. దీంతో పాటు మరిన్ని రంగాల్లో భారత్లో పెట్టుబడులు పెట్టేందుకు మస్క్ గ్రూప్ కంపెనీలు సన్నద్ధమవుతుండం భారత్కు అనుకూలించే అంశం. ఎలాన్ మస్క్కు చెందిన మరో కంపెనీ అయిన స్టార్లింక్, ఇటీవల భారత టెలికాం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్టెల్తో కలిసి ఇండియాలో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల్ని అందించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతేకాకుండా, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అతని భార్య ఉష వచ్చే వారం భారతదేశాన్ని సందర్శించనున్నారు. పర్యటనలో భాగంగా కొత్త ట్రేడ్ టారిఫ్ అంశంపై కూడా వాన్స్ భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతారు. ఈ నెల ప్రారంభంలో ట్రంప్ ప్రభుత్వం భారతీయ వస్తువులపై 26% దిగుమతి సుంకాన్ని విధించింది, తర్వాత వాటి అమలును 90 రోజులు నిలిపివేసిన సంగతి తెలిసిందే. వాణిజ్య ఒప్పందం కింద భారత్ – అమెరికాలు రాబోయే వారాల్లోనే రంగాల వారీ చర్చలు జరపనున్నాయి. ఇవి ట్రంప్ సడలించిన 90 రోజుల వ్యవధిలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఒప్పందాల యొక్క నిబంధనలు ఇప్పటికే ఖరారు అయినట్టు తెలుస్తోంది. మరిన్ని చర్చలు ప్రధానంగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కూడా భారత్ – అమెరికాల మధ్య జరగనున్నాయి. అటు, భారత బృందం కూడా త్వరలోనే అమెరికాను సందర్శించే అవకాశం కనిపిస్తోంది. అయితే ట్రేడ్ టారిఫ్స్ ఒప్పందాల్లో ఇరు దేశాల మధ్య జీరో ట్యాక్స్ విధానం అమలు ఉండే అవకాశం లేదు. ఎందుకంటే అటువంటి ప్రణాళిక, సాధారణంగా మరింత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదాహరణకు యూరోపియన్ యూనియన్ – అమెరికా వంటి ఆర్థిక వ్యవస్థలు దీనికి సరిపడతాయి కాని, కానీ అది అభివృద్ధి చెందుతోన్న భారతదేశం, అభివృద్ధి చెందిన అమెరికా మధ్య జరిగే అవకాశాలు చాలా తక్కువ.

## ప్రతినెల 3వ శనివారం ఏపీలో .. 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'

సంకల్పంలో భాగంగా 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం నాడు జరుపుకుంటున్నాం. ప్రతి కార్యక్రమం స్ఫూర్తివంతంగా ఉండేందుకు నెల నెలా ఒక్కో థీమ్ ను ఎంచుకుని నిర్వహిస్తున్నాం. ఈసారి 'ఈ–వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం' థీమ్ ను ఎంచుకోవడం జరిగింది. ఎందుకంటే చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుంది. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎన్జీఓలు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరుతున్నాను. ఎక్కడికక్కడ ఇ–వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయండి. వీటి నిర్వహణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్హెచ్జి సభ్యులను గుర్తించి.. వారి సేవలను వినియోగించుకోండి. 'రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్" అనేది ఈ – వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నినాదం కావాలి. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి తద్వారా స్వర్ణాంధ్ర సంకల్పాన్ని మరింత ముందుకు వెళ్లే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నాను" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## విత్తన కంపెనీల మోసాలు పన్ను ఎగవేత

పాల్పడుతున్నాయి.విశేషంగా వరంగల్, కరీంనగర్, గుంటూరు, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో ఈ కంపెనీలు పన్ను మినహాయింపు పొందిన రైతుల పేర్లను ఉపయోగించి తాము వ్యవసాయ ఉత్పత్తులు చేశామంటూ తప్పుడు లెక్కలతో ఆదాయపు పన్ను శాఖను మోసం చేస్తున్నాయి. వాస్తవంగా, రైతులకు వారి వ్యవసాయ ఆదాయంపై పన్ను మినహాయింపు ఉన్నా, కంపెనీలకు మాత్రం అది వర్తించదు. అయినా వాటి ఖర్చులను లెజిట్గా చూపించేందుకు తప్పుడు రికార్డులు తయారు చేస్తూ, పన్ను ఎగవేతకు పాల్పడుతున్నాయి.

**రైతుల పేర్లతో విత్తన కంపెనీల మోసం: రూ.1,000 కోట్ల పన్ను ఎగవేత**

ఉదాహరణకి, ఒక పెద్ద కంపెనీ రైతులు, వ్యాపారుల వద్ద నుంచి రూ.500 కోట్లు నుంచి రూ.1,500 కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే ఆదాయపు పన్ను అధికారులు గతంలో చేసిన తనిఖీల్లో ఈ కంపెనీలు రైతుల పేరుతో మోసం చేస్తున్నట్టు గుర్తించారు. అంతేకాకుండా నగదు రూపంలో చెల్లింపులు చేయడం ద్వారా కూడా పన్ను ఎగవేతకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ విధంగా రూ.రెండు లక్షలకుపైగా లావాదేవీలు చేసినా బ్యాంక్ మార్గాల్లో చెల్లింపులు చేయకపోవడం, డీలర్లపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు డబ్బుగా కోరడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి.ఈ పరిస్థితులపై ఆదాయపు పన్ను శాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రైతుల పేర్లు ఉపయోగించి జరిగే ఈ అక్రమాల వల్ల ప్రభుత్వం ఆదాయానికి నష్టం జరుగుతోంది. అటు నిజమైన రైతులు కూడా నేరుగా ఎటువంటి లాభం పొందకుండానే మోసానికి బలవుతున్నారు. విత్తన కంపెనీల లావాదేవీలపై సమగ్ర దర్యాప్తుతో పాటు, ఈ రకమైన మోసాలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు అవసరమవుతున్నాయి.

## అడవుల్లో కాల్పుల మోత

విడుదల చేసిన విషయం తెలిసిందే. తాము శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు పార్టీ లేఖలో తెలిపినప్పటికీ అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఛత్తీస్గఢ్ ప్రభుత్వం కానీ స్పందించడం లేదు. వరుసగా ఎన్కౌంటర్లు చోటు చేసుకుంటాయి. భద్రతాబలగాలు మావోయిస్టులు ఉన్న ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. మావోయిస్టులు తారసపడిన వెంటనే కాల్పులు జరుపుతున్నారు. వారు తిరిగి ప్రతిఘటించినప్పటికీ అప్పటికే చాలా మావోయిస్టులు నేలరాలిపోతున్నారు. మావోయిస్టు అగ్రనేతలంతా కూడా భద్రతాబలగాల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు పెద్ద ఎత్తున మావోయిస్టులు కూడా లొంగిపోతున్నారు. ఇటు తెలంగాణ ప్రభుత్వం వద్ద, అటు ఛత్తీస్గఢ్ ప్రభుత్వం వద్ద దళాలు లొంగిపోతున్నారు.

ఛత్తీస్గఢ్ దండకారణ్యం వార్ జోన్ మారిపోయింది. వచే ఏడాది మార్చి 31 నాటికి ఈ దేశంలో మావోయిస్టు పార్టీలను పూర్తిగా కూకటి వేళ్లతో పెకిలించి వేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శపథం చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. నారాయణపూర్ ఎన్కౌంటర్కు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## బెట్టింగ్ యాప్లకు.. అడ్డుకట్ట..

ఖాతాల్లో ఉన్న సొమ్మును కూడా తగిలేసి.. చివరకు చేసేది ఏమీ లేక.. ప్రాణాలు తీసుకుంటున్నారు.. అయితే, బెట్టింగ్స్ యాప్స్ను తెలుగు రాష్ట్రాలకు చెందిన సెలబ్రిటీలు కూడా ప్రమోట్ చేశారు.. ప్రమోషన్లతో వారు కోట్లు వెనకేసుకుంటే.. అమాయకులు మాత్రం అప్పులపాలై.. ప్రాణాలు విడుస్తున్నారు.. దీనిపై 'నా అన్వేషణ' ఫేం అన్వేష్.. సంచలన విషయాలను బయటపెట్టారు.. బెట్టింగ్ మాఫియా గురించి.. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి మన సెలబ్రిటీలు ఎన్ని కోట్లు సంపాదిస్తున్నారో కూడా లెక్కలు బయటపెట్టడంతో.. తెలంగాణ పోలీసులు రంగంలోకి దిగి.. సెలబ్రిటీలకు నోటీసులు.. వారిని ప్రశ్నించడం.. కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఇక, కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి పేరుతో గోవిందా అనే బెట్టింగ్ యాప్ వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్కి దృష్టికి తీసుకెళ్లారు.. నా అన్వేషణ ఫేం అన్వేష్.. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందించారు.. నా అన్వేష్ పోస్టు చేసిన వీడియోను ట్యాగ్ చేస్తూ.. "బెట్టింగ్ యాప్లు జీవితాలను నాశనం చేస్తున్నాయి. జూదానికి బానిసైన యువత.. నిరాశలోకి నెట్టబడుతున్నారు.. నేను వందలాది హృదయ విదారక కథలను వింటున్నాను. ఇది ఆపాలి. దీర్ఘకాలిక పరిష్కారం ఏమిటంటే నిరంతర అవగాహన కల్పించడం.. మరోవైపు బెట్టింగ్ యాప్లపై కఠినంగా వ్యవహరించడమే అన్నారు.. మొత్తం దేశానికే ఒక ఉదాహరణగా నిలిచే సమగ్ర బెట్టింగ్ వ్యతిరేక విధానంపై మేం కృషి చేస్తున్నాం. ఈ ముప్పును అంతం చేయడానికి అన్ని చట్టపరమైన మార్గాలను అన్వేషిస్తాం అంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు మంత్రి నారా లోకేష్..

## సిట్ ముందుకు సాయిరెడ్డి

అందులో భాగంగా ఈరోజు విచారణకు రావాల్సిందిగా విజయసాయిరెడ్డికి నోటీసులు ఇచ్చారు సిట్ అధికారులు. అయితే సిట్ అధికారులు ఏప్రిల్ 18న రావాలని మొదట నోటీసులు ఇవ్వగా.. ఏప్రిల్ 17న అంటే నిన్న వస్తానని కబురు పంపారు సాయిరెడ్డి. అయితే కొన్ని కారణాల వల్ల విచారణకు రాలేకపోతున్నానని మరోసారి సమాచారం ఇచ్చారు. శుక్రవారం కచ్చితంగా విచారణకు వస్తానని చెప్పిన విజయసాయి.. అన్న ప్రకారమే మధ్యాహ్నం 2 గంటలకు సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ క్రమంలో మద్యం కుంభకోణానికి సంబంధించి విజయసాయి ఏం చెప్పబోతున్నారు అనేది ఉత్కంఠంగా మారింది. ఇక మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి తండ్రిని కూడా విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయన సిట్ ముందు నిన్న విచారణకు రాగా.. పలు ప్రశ్నలు సంధించారు సిట్ అధికారులు. కసిరెడ్డి తండ్రి సెల్ఫోన్ను తీసుకుని కాల్ లిస్ట్ను చెక్ చేశారు. మీ అబ్బాయి ఎక్కడున్నారని అడుగగా తెలియదనే సమాధానం వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఎన్నో ప్రశ్నలకు కూడా రాజ్ తండ్రి మౌనమే వహించినట్లు సమాచారం. అలాగే ఈరోజు కూడా విచారణకు రావాలని చెప్పడంతో సిట్ ఆఫీసుకు వచ్చారు రాజ్ తండ్రి. కసిరెడ్డి గురించి పలు ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన విచారణ కొనసాగుతోంది.

## కొత్తగా నియమితులైన మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు

తాజాగా గెజిట్ను విడుదల చేసింది. దీనివల్ల సుమారు వేలాది మంది మహిళా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది.

**ప్రబలంగా నిలిచిన మహిళా హక్కుల పోరాటం**

ఇది చిన్న విషయం కాదు. ఉద్యోగంలోకి కొత్తగా వచ్చిన మహిళలు ప్రసూతి సెలవులు తీసుకోవాలంటే రెండు సార్లు ఆలోచించేవారు. ఎందుకంటే, సెలవులు తీసుకుంటే ప్రొబేషన్ కాలం పొడిగించబడతుందేమో అనే భయం ఉండేది. కానీ ఇప్పుడు ప్రభుత్వం చేసిన ఈ సానుకూల నిర్ణయం మహిళా ఉద్యోగుల భద్రతను మరింత బలోపేతం చేస్తోంది. ఇది ఒకరకంగా మహిళా ఉద్యోగుల హక్కుల పోరాటానికి గెలుపు లాంటి అంశం. గతంలో ఎన్ని వినతులు చేసినా, ఎన్ని ఫిర్యాదులు వచ్చినా స్పందించని ప్రభుత్వ యంత్రాంగం ఇప్పుడు తక్షణమే స్పందించడం, మహిళా ఉద్యోగుల జీవితాల్లో ఆశావహ మార్పులకు నాంది పలికింది. గెజిట్ ద్వారా అధికారిక ధ్రువీకరణ ఈ నిర్ణయం ఎలాంటి అనుమానాలకు తావులేకుండా గెజిట్ ద్వారా అధికారికంగా ప్రకటించబడినట్లు సమాచారం. ఇకపై కొత్తగా నియమితులైన ఉద్యోగినులు తల్లిగా మారే సమయాన్ని ఆందోళనలతో కాకుండా ఆనందంగా గడిపే అవకాశం లభించనుంది. మాతృత్వాన్ని ప్రోత్సహించే విధంగా ఈ నిర్ణయం తీసుకోవడం సర్కార్ మంచి సంకేతం. ఇది రాష్ట్రంలోని మహిళా ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింత పెంచుతుంది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే అనేకమంది మహిళా ఉద్యోగులు సోషల్మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. "ఇది మా కోసం తీసుకున్న గొప్ప నిర్ణయం, ఇప్పుడు కుటుంబం, ఉద్యోగం రెండింటినీ సమతుల్యంగా నడిపే అవకాశం ఏర్పడింది" అని అంటున్నారు. ఇటీవలె ఉద్యోగంలో చేరిన అనేకమంది మహిళలు తల్లి కావడం వల్ల ఉద్యోగ భద్రతపై ఆందోళనలలో ఉండేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన క్లారిటీ వల్ల వారు సంతోషంగా తల్లి కావచ్చు, భవిష్యత్తుపై భయాలు లేకుండా ముందుకెళ్లొచ్చు.

## గిరిజనులకు చెప్పుల పంపిణీ


ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించారు. పవన్ను చూడటానికి ఆ గ్రామంలోని పాంగి మిత్తు అనే వృద్ధురాలు వచ్చింది. ఆమెకు కనీసం చెప్పులు లేకుండా తనను చూడటం కోసం రావడాన్ని చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారు. వెంటనే పక్కనున్న ఉపాధి హామీ సిబ్బంది గురించి ఈ విషయంపై ఆరా తీశారు. ఈ నెల 7వ తేదీన అల్లూరి జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా "అడవి తల్లిబాట" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ప్రాంతానికి చెందిన పాంగి మిత్తు అనే వృద్ధురాలు పవన్ను చూడటానికి వచ్చింది. అయితే ఆమె చెప్పులు లేకుండా ఉండటాన్ని చూసిన పవన్ కల్యాణ్ చలించిపోయారు. వెంటనే అక్కడున్న ఉపాధి హామీ సిబ్బందితో ఈ విషయం గురించి పవన్ కల్యాణ్ మాట్లాడారు. గిరిజనులకు వెంటనే చెప్పులను తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం వారితో మాట్లాడాలని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బందిని పవన్ కల్యాణ్ ఆ ఊరికి పంపించారు. గిరిజనులకు కావాల్సిన చెప్పుల సైజులు, ఎంతమందికి చెప్పులు లేవనే వివరాలను కార్యాలయ సిబ్బంది సేకరించింది. అనంతరం 345 మంది గిరిజనులకు ఇంటింటికీ వెళ్లి పాదరక్షలను పవన్ కల్యాణ్ కార్యాలయ సిబ్బంది, స్థానిక సర్పంచ్ వెంకటరావు అందజేశారు. ఇవిధంగా పవన్ కల్యాణ్ గొప్ప మనస్సు చాటుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమపట్ల స్పందించిన తీరుపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

## జీసస్ త్యాగం ఒక మానవతా మార్గదర్శకం : జగన్

చేసిన త్యాగం ఒక మానవతా మార్గదర్శకం అని, ప్రతి మనిషికి ప్రేమ, క్షమ, దయ, సహనం వంటి విలువలు ఎలా ఉండాలో ఆయన జీవితంలోంచి నేర్చుకోవచ్చని అన్నారు. గుడ్ ఫ్రైడే నాడు క్రీస్తును శిలువ వేయడం ద్వారా జరిగిన త్యాగం వెనుక ఒక మహత్తరమైన సందేశం దాగి ఉంది. మనిషి చేసిన పాపాలకి విమోచనం కలిగించాలనే ఉద్దేశంతో ఏసు క్రీస్తు తన ప్రాణాన్ని అర్పించిన ఘట్టాన్ని గుర్తిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు శోకభరితంగా ఈ రోజును ప్రార్థనలతో గడుపుతున్నారు. ఈ సందర్భంలో జగన్ చేసిన వ్యాఖ్యలు, ప్రజల్లో ఆత్మవిమర్శను, మానవతా విలువలపై చింతనను కలిగించేలా ఉన్నాయి.

**జీసస్ జీవితం - ప్రేమ, క్షమ, దయకు మార్గదర్శి**

జీసస్ జీవితం అనేది కేవలం ఓ మతపరమైన గాథ కాదని, అది ప్రతి మనిషికి మార్గదర్శకంగా నిలుస్తుందని జగన్ అభిప్రాయపడ్డారు. పీడితుల పట్ల కరుణ చూపడం, శత్రువులను సైతం క్షమించగల శక్తి కలిగి ఉండటం, నిస్సహాయుల కోసం తన జీవితాన్నే అర్పించడం %–% ఇవన్నీ ఏసు క్రీస్తు జీవితం ద్వారా మానవాళికి అందిన విలువలు. ఇవే నేటి సమాజంలో అవసరమైన ముఖ్యమైన గుణాలు అని, మనమంతా వాటిని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జగన్ చేసిన వ్యాఖ్యలు కేవలం ఓ మతపరమైన అభివ్యక్తిగా కాకుండా, సమాజం కోసం ఒక మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. రాజకీయ నాయకుడిగా కాకుండా, మానవతా విలువలను నమ్మిన వ్యక్తిగా ఆయన చెప్పిన ఈ మాటలు ప్రజల మనసుల్లో చోటు చేసుకుంటున్నాయి.



## కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం

### -రఘురామ కృష్ణంరాజు ఫైర్

**గుంటూరు ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కూటమి ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తున్నామని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం నాడు రతన టాటా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రఘురామ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా కేవలం పారిశ్రామికవేత్త మాత్రమే కాదు గొప్ప మానవతావాదని అభివర్ణించారు. విద్య, వైద్య రంగాల్లో ఆయన చేసిన సేవలు నిరుపమానమని ప్రశంసించారు. రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలని అందరి కోరిక అని రఘురామకృష్ణరాజు చెప్పారు. ఈ విషయంపై తాను నాలుగేళ్ల క్రితమే ప్రధానికి లేఖ రాశానని రఘురామకృష్ణరాజు చెప్పారు. అవార్డు ఇచ్చినా, లేకున్నా ఆయన భారతీయుల హృదయాల్లో రత్నమేనని కొనియాడారు. టీడీపీ నేత కోడెల శివప్రసాదరావుతో తనకు సన్నిహిత సంబంధం ఉందని చెప్పారు. టీడీపీ హయాంలో మాజీ స్పీకర్ కోడెలపై వైసీపీ నాయకుల చిల్లర మాటలను తాను వ్యతిరేకించానని గుర్తుచేశారు. ఇలా తాను వ్యతిరేకించటంతో జగన్ తనను దూరం పెట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వంపై కొన్ని పత్రికలు దుష్ప్రచారం చేస్తున్నాయని రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్థానిక మోరంపూడిలో జరిగిన శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలు... ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని అమ్మ వారిని వేడుకున్నారు. కాగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

## మే 10న జాతీయ లోక్ అదాలత్

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

**రాజమహేంద్రవరం ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ శ్రీమతి. గంధం సునీత , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి వివిధ భీమా సంస్థల ప్రతినిధులు మరియు ఆ సంస్థల న్యాయవాదులతో సమావేశమయ్యారు. మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నందు అధిక మొత్తంలో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు తగు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ మేరకు పెండింగ్ లో ఉన్న మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో భీమా సంస్థల వారు, యాక్సిడెంట్ కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొవాలని అన్నారు. ఈ సమావేశంలో గవర్నమెంట్ ప్లీడర్ సి.హెచ్.వి.ప్రసాద్ , ఆయా సంస్థల న్యాయవాదులు, చిట్ ఫండ్ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించిన జడ్జి రత్న ప్రసాద్



**ఏలూరు ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రత్న ప్రసాద్ సందర్శించారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం స్థానిక పత్తేబాద లో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రత్న ప్రసాద్ సందర్శించారు. వసతి గృహంలో వృద్ధులకు అందుతున్న వసతుల పైన, ఆహార పదార్థాల నాణ్యత, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారితో మాట్లాడుతూ న్యాయ సంబంధిత సమస్యలు ఉన్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని, ప్రభుత్వ పథకాలను పొందడంలో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో ఇచ్చిన సంబంధిత అధికారుల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అవసరమైతే పారా లీగల్ వాలంటీర్ల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. పరిసరాల శుభ్రతను మరింత మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉందని, ప్రస్తుతం దోమలు బెడద ఎక్కువగా ఉందని దాన్ని నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### చలివేంద్రాలు ఏర్పాటు

## అభినందనీయం

### మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వేసవిలో బాటసారుల కోసం మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ప్రతి ఏడాది వేసవిలో ప్రతిరోజు 40 లీటర్ల మజ్జిగ, మంచినీళ్ల చలివేంద్రం ఏర్పాటు గొప్ప విశేషమని అన్నారు. ఆలయ ధర్మకర్త ఛైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ దంతులూరి జగన్నాథరాజు నాల్గొవ కుమార్తె స్వర్గీయ అల్లూరి సూరయమ్మ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం నిమిత్తం 3.94 సెంట్లు భూదానం చేసారని, దాత ఆశయాల మేరకు వేసవిలో ప్రతిరోజు 40 లీటర్ల మజ్జిగ, మంచినీళ్ల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, గంటా త్రిమూర్తులు, ఈవో దండు వెంకట కృష్ణంరాజు, దేవస్థాన ఇన్ స్పెక్టర్ బి వెంకటేశ్వరరావు ఆలయ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.

### ప్రతి నెలా మూడో శనివారం

## 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర'

- ఏప్రియల్ నెల "సస" లో ఈ వెస్ట్ వ్యర్థాలు సేకరణ కాన్సెప్ట్
- త్రీబుల్ ఆర్ భావన తో ఈ వెస్ట్ మేనేజ్మెంట్
- నిత్య కృత్యంలా కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలి
- స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ప్రతి ఒక్కరూ విజయ వంతం చేసే విధంగా భాగస్వామ్యం కావాలి
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కియోస్కీ లు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడోవ శనివారం "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమం ప్రతి నెలా ఒక భావన (కాన్సెప్ట్) తో నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగా ఏప్రియల్ నెల "స స" కార్యక్రమంలో "ఈ వెస్ట్ డిస్పోజల్ " కార్యక్రమం ను నిర్వహించూసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏదో ఒక పంచాయతీ రాజ్ లేదా మున్సిపల్ కార్యాలయం యొక్క శానిటేషన్, డ్రైనేజ్ క్లీనింగ్ కార్యక్రమంలా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమం లా తీర్చి దిద్దుదాం అనే సంకల్పంతో కూడి ప్రజల భాగస్వామ్యం కలిగించే సామాజిక స్పృహ తో కూడి రూపొందించడం జరిగిందన్నారు. తక్కువ వ్యర్థాలు ఉండేలా, తిరిగి వినియోగించాలి, వ్యర్థాలు తగ్గించాలి అనే "ఆర్ ఆర్ ఆర్" కాన్సెప్ట్ తో కూడి కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఈ శనివారం ఈ వెస్ట్ మేనేజ్మెంట్ తో కూడిన కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పౌరులందరికీ విజ్ఞప్తి మీ కార్యాలయాలలో, గృహాలలో వృథాగా ఉన్న ఎలెక్ట్రానిక్ పరికరాలను మునిసిపల్, గ్రామ పంచాయతీలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వెస్ట్ సేకరణ కియోస్క్ ల వివరాలు తెలుసుకోవడం, అక్కడ వాటిని అందచేయాలన్నారు. తద్వారా ఈ వెస్ట్ (ఎలెక్ట్రానిక్ స్క్రాప్) వ్యర్థాలను సరియైన విధానంలో పారవేయడం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఎలెక్ట్రానిక్ వ్యర్థాలు ఇష్టానుసారం బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వలన అవి భూమిలో, నీటిలో కలవడం వలన మనం ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. వాటిని నివారించే క్రమంలో ఎలెక్ట్రానిక్ వ్యర్థాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఈ వెస్ట్ కియోస్కో లకు అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. ఏప్రియల్ 19 వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల , ప్రజలందరి భాగస్వామ్యంతో "స్వర్ణ ఆంధ్ర – స్వ చ్ఛ ఆంధ్ర ప్రో గ్రాం" విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. స్థానిక రాజమండ్రి రూరల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉన్న వై టి సి భవనంలో ఏప్రియల్ 19 శనివారం ఉదయం జిల్లా స్థాయి సా సా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలియ చేశారు.

## వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

**భీమవరం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లాలో వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు చేసుకోవచ్చునని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు 8 నుండి 14 ఏళ్ల వయసు గల 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆసక్తి గల వివిద క్రీడల జిల్లా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాద్యాయులు, వ్యాయామ ధర్శకులు, సీనియర్ క్రీడాకారులు వారి ధరఖాస్తులను పూర్తి వివరములతో అందజేయాలని అన్నారు. ఈనెల 21వ తేదీలోపు ఆసక్తి గల వారు 85000 64372 కు సంప్రదించాలని కోరారు.



## జనసేన కార్యకర్తకు రూ 10 వేలు ఆర్థిక సహకారం

**భీమవరం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం పట్టణం 12వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన జనసేన కార్యకర్త సింహాచలం అనారోగ్యరిత్య హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. వైద్యం నిమిత్తం పులపర్తి ప్రశాంత్ టీమ్ రూ 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కొప్పినీడి శ్రీనివాస్, యర్రంశెట్టి రాజేష్, రెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

# పాడేరులో వర్ష భీభత్సం

- నేలకూలిన భారీ వృక్షాలు:
- కూలిన విద్యుత్ స్తంభం:
- ద్విచక్ర వాహనంపై కూలిన చెట్టు.. వాహనం ధ్వంసం:
- పాడేరు పట్టణం అతలాకుతలం:



**పాడేరు ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.సుమారు 20 నిమిషాలు పాటు భయంకరంగా ఈ వర్షం కురిసింది.పాడేరు పట్టణాన్ని చినుకు చినుకు కు గ్యాప్ లేకుండా ఈదురు గాలులు మధ్య కుండ పోతగా వర్షం కురిసింది.దీంతో ఒక్క సారిగా పట్టణంలో పలు చోట్ల భారీ వృక్షాలు,విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.పట్టణంలో ఉన్న జి సి సి కార్యాలయం సమీపంలో ఉన్న సిల్వర్ చెట్టు రోడ్డుపై పడిపోవడంతో విద్యుత్ స్తంభం,వైర్లు తెగిపడ్డాయి.అలాగే మైదానం ప్రాంతం నుంచి వ్యాపారం నిమిత్తం పాడేరు వారపు సంతకు వచ్చి రోడ్డు ప్రక్కన పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంపై చెట్టు పడటంతో వాహనం పూర్తిగా ధ్వంసం అయింది.ఎదురు గాలులతో ప్లెక్సీ బో గాలికి కొట్టుకు పోయాయి. రోడ్డు పై చెట్టు కూలడంతో వాహనాలు రాకపోకలు స్తంభించాయి. అలాగే తలారిసింగి వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది.దీంతో విద్యుత్ వైర్లు తెగిపోయి వాహనాలు రాకపోకలు స్తంభించాయి పోయాయి.అలాగే పాడేరు నుంచి జి.మాడుగుల వెళ్లే మార్గ మధ్యలో డీ.గొండూరు రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో ఆ రహదారిపై వాహన రాకపోకలు స్తంభించుకు పోయాయి.పాడేరు ఫారెస్ట్ కాలనీ ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.అలాగే గుత్తులపుట్టు నుంచి 132 కెవి నుంచి ప్రధానంగా విద్యుత్ సరఫరా అయ్యే లైన్ ల్లో నాలుగు విద్యుత్ స్తంభాలు భారీ వర్షం కారణంగా నష్టం కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షాలను తొలగించే పనుల్లో విద్యుత్ శాఖ,రెవెన్యూ,అర్ అండ్ బి అధికారులు,సిబ్బంది నిమగ్నమై ఉన్నారు.భారీ వర్షానికి పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని,తెగిపడిన విద్యుత్ వై ర్ల ను తొలగించి స్తంభాన్ని తీస్తూ వై ర్లను సారి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనుల్లో విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బంది నిమగ్నమై ఉన్నారు.యుద్ధ ప్రాతిపదికన ఫిద్యుత్ సరఫరా పునరుద్దరణకు విద్యుత్ సిబ్బంది శ్రమిస్తున్నారు.రోడ్డుపై కూలిన భారీ వృక్షాలను తొలగించి వాహన రాకపోకలు పునరుద్దరణకు అన్ని చర్యలు సంబంధిత అధికారులు సిబ్బంది నిమగ్నమయ్యారు.ఈ భారీ వర్షానికి పాడేరు పట్టణం అంతా విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉంది. శుక్రవారం పాడేరు వారపు సంత కావడంతో ఈ భారీ వర్షానికి వారపు సంత అతలాకుతలం మారింది.రోడ్డు కు ఇరువైపులా వేసిన కాయగూరలు దుకాణాలు ఈదురు గాలులకు వర్షానికి చెల్లా చెదురుగా పడిపోయాయి పాతపాడేరు గ్రామంలో వారపు సంతకు సంబంధించిన నిత్యావసర సరుకులు స్టోర్ చేసే ఇంట్లోకి వర్షం నీరు వెళ్లడంతో సుమారు రెండులక్షల రూపాయలు విలువ గల నిత్యావసర సామాగ్రి తడిచి ముద్దయ్యాయి.పాడేరు ప్రాంతంలో ఎన్నడూలేని విధంగా సుమారు 20 నిమిషాలు పాటు పడిన ఈదురు గాలులు తో కూడిన భారీ వర్షంతో పట్టణంలో వర్ష'భీభత్సం సృష్టించగా ఇదే వర్షం ఒక గంటపాటు పడితే పాడేరు లో హుదూద్ లా అన్ని చెట్లు,విద్యుత్ స్తంభాలు కూలీ అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉండేదని ప్రజలు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి








డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శనివారం19 ఏప్రిల్ 2025





# నూతన వాటర్ ట్యాంక్ ప్రారంభం.

### గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తా. -ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్, వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు, ఎంపీ హరీష్ మాధుర్. వాడపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పార్లమెంట్ సభ్యులు గంటి హరీశ్ మాధూర్ లు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు త్రాగు నీటి సరఫరా కోసం ఇంటింటికీ త్రాగునీటి పథకం ద్వారా రూ.89.80 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన ఘన ద్రవ్య వ్యర్థ పదార్థముల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కొన్ని అభివృద్ధి పనులు నిర్మాణం పూర్తి కానున్నాయని త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అభివృద్ధి కోసం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎంపీ హరీష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యానందరావు కోరిక మేరకే నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నానని అభివృద్ధి కోసం కృషి చేయడంలో ఎమ్మెల్యేకు తోడుగా ఉంటానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సత్యానందరావు, ఎంపీ హరీష్ లకు గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే ఉత్తమ సర్పంచ్ గా ఎన్నికై ఢిల్లీలో అవార్డు అందుకున్న గ్రామ సర్పంచ్ త్సామా ఆదినారాయణ మూర్తి (బాబు) ను ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ తప్పుడు ప్రచారాలు మానుకోవాలి.

### తిరుమల ప్రతిష్ఠ దెబ్బతీస్తున్న వైసీపీ.

### ఎన్డీయే ప్రభుత్వంలో తిరుమలకు పూర్వవైభవం. -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల గోశాల వ్యవహారంపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హెచ్చరించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోశాలలో గోవులు మరణించక పోయినా మరణించినట్టు రాద్ధాంతం చేయడం సరికాదని, నిజాలను బయట పెడతామని వెళ్లి రోడ్డుపై బైఠాయించడం ఏంటని మండిపడ్డారు. టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయని వైసిపి నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమా కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారమని, తిరుమల లో వైసిపి హయంలో జరిగిన అక్రమాలను, అపాచారాలను సరిదిద్ది తిరుమల పవిత్రను కూటమి ప్రభుత్వం కాపాడుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి, టిటిడి పాలక మండలి కి వస్తున్న మంచిపేరు చూసి ఓర్వలేక వైసీపీ రోజుకో వివాదాన్ని సృష్టిస్తోందని, నాడు వైసిపి ప్రభుత్వం వీఐపీ సేవలో తరిస్తే నేడు కూటమి ప్రభుత్వం సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తుందని అన్నారు. భూమన కరుణాకరరెడ్డికి నిజంగా చిత్తశు ద్ధి ఉంటే తిరుమలలో సర్వ దర్శనం చేసుకొని బయటకు వచ్చిన భక్తులను అడిగితే ఎవరి పాలనలో తిరుమల ఎలా ఉందో భక్తులే చెపుతారని, వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భ్రష్టు పట్టించింది. ఆఖరకు భక్తులు పరమ పవిత్రంగా భావించే లడ్డు తయారీలో కూడా కల్తీ నెయ్యిని వాడిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమల దేవస్థానము పవిత్రతను కాపాడటానికి, సామాన్య భక్తులను మెరుగైన సేవలు అందించడానికి అనేక చర్యలు తీసుకుందని వివరించారు. వైసిపి ప్రభుత్వం హయంలో జరిగిన అక్రమాలపై విచారణ కారణంగా నాడు వారు చేసిన అరాచకాలు బయటకు వస్తున్నాయి. వాటి నుండి దృష్టి మార్చడానికి టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయని దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే సత్యానందరావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విల్లా మారుతీ, కొప్పిశెట్టి ప్రసాద్, బొక్క ప్రసాద్, బోడపాటి మారుతీ, మజ్జి తరుణ్, జక్కంపూడి బాలాజీ, కముజు వర ప్రసాద్, దంగేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

### సరస్వతి ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# మజ్జిగ చలివేంద్రం..

**అమలాపురం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అమలాపురం పేరూరు వై జంక్షన్ వద్ద సరస్వతి ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టి.ఎస్ ఎన్ మూర్తి ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరరావు, పేరూరు సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్ లు సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పులుసు జగదీశ్, మానసిక వైద్యులు డా. గంగరాజు, పేరూరు ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ,పండు అశోక్ కుమార్,దొంగ కుమార్, అడపా శ్రీను, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు,నెల్లి ప్రసాద్, దేవరపల్లి వీరేష్ కుమార్,యెలమిల్లి కొండ,తాళ్ళ పల్లేశ్వర రావు, తాళ్ల సాంబ మూర్తి, గంటా అరుణ్ కుమార్, గోసంగి సత్యనారాయణ మూర్తి, ఎం.వి. వి. సత్యనారాయణ, దాసరి నాగేశ్వరరావు, బొక్కా నాని మరియు ట్రస్ట్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# ప్రతి కేసులో మానవత్వపు కోణం ఉండాలి

### జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి వి నరేష్

### ఘనంగా వీడ్కోలు పలికిన బార్ అసోసియేషన్ సభ్యులు

**అమలాపురం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి వి. నరేష్ బదిలిపై అనకాపల్లి వెళ్తున్న సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరిన సాయి, కార్యదర్శి నందిక శ్రీను ఆధ్వర్యంలో వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. జడ్జ్ వి. నరేష్ వీడ్కోలు సభకు ముఖ్యతిదులుగా పి. డి. ఎమ్ హిమాబిందు, ముమ్మిడివరం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎమ్. డి రహ్మతు ల్లా, మేజిస్ట్రేట్ శ్రీలేఖ, స్పెషల్ మేజిస్ట్రేట్ ప్రసాద్ పాల్గొనగా సీనియర్ లాయర్ డి. బి. లోక్ వీడ్కోలు సభలో పాల్గొన్న అందరిని తన ప్రసంగంతో నవ్విస్తూ నవ్వుల పువ్వులను పూయించారు. బార్ అసోసియేషన్ అండ్ బెంచ్ సంబంధాలు పూర్తి స్థాయిలో నిలబడలాంటే సమన్వయంతో ఆయన సేవలతో ముందు కు సాగి అందరూ మనస్సుల్లో మహోన్నత వ్యక్తిగా నిలిచారాని సభలో ప్రసంగికులు కొనియాడారు. ప్రతి కేసులో మానవత్వపు కోణంలో అలోచించి నిర్ణయాలు తీసుకోడం అలవాటు చేసుకోవాలని న్యాయమూర్తి నరేష్ అన్నారు. జిల్లా రెండవ అదనపు జడ్జి వి. నరేష్, శ్రీదేవి దంపతులను ముఖ్యతిదులు, బార్ అసోసియే షన్ సభ్యులు పుష్పగుచ్ఛాలు, ప్రకృతికి ప్రతిగా నిలిచే విశిష్ట మొక్కలను అందజేసి దుశ్శలవాలనుకప్పి గజమాలతోఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు మహిళా లాయర్లు పాల్గొన్నారు.

### జగన్మోహినీ కేశవస్వామి

# అన్నదాన పథకానికి దాతల విరాళాలు



**ఆత్రేయపురం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహినీ కేశవస్వామి దేవస్థానంలో నిర్వహించే అన్నదాన పథకానికి శుక్రవారం పలువురు దాతలు విరాళాలు అందజేసారు. హైదరాబాద్ కు చెందిన వడ్లమాని సోమశేఖర్, వేంకట విజయ శారద రూ.10,116 విరాళంగా సమర్పించారు. అలాగే ఏలూరుకు చెందిన కొమ్మారెడ్డి సాంబశివరావు రూ.5,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఆశీర్వచనం చేయించిన అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకట రమణమూర్తి, అర్చకులు, సిబ్బంది స్వామి వారి శేష వస్త్రంతో సత్కరిచారు.

# మందపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన.

**కొత్తపేట ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో ఎంపీ లాడ్స్ రూ.30 లక్షల నిధులతో ఏటు గట్టుపై నూతన రోడ్డు నిర్మాణానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీశ్ మాధుర్, ఆకుల రామకృష్ణ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మందపల్లి మందేశ్వర (శనీశ్వర) స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామస్థులు కూడా ఈ రోడ్డు నిర్మిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. మా గ్రామానికి వచ్చే భక్తులతో పాటు మాకు కూడా ఎంతో సౌలభ్యంగా ఉంటుందని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ం



# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే.

**కొత్తపేట ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏసు క్రీస్తు ప్రభువు వారు సకల మానవాళి పాప పరిహారార్థమై శిలువ యాగం పొందిన రోజును జ్ఞాపకం చేసుకుంటూ స్థానిక పినిపే వారిపేట, కొత్తపేట ప్రవచన దేవుని సంఘం ఎరుషలేము చర్చ్ బిషప్ జి ఆబెద్నగొ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే కార్యక్రమాన్ని ఘనంగా ఆచరించారు. ఈ కార్యక్రమంలో యేసు క్రీస్తు ప్రభువు వారు శిలువపై పలికిన ఏడు మాటలను జ్ఞాపకం చేసుకుంటూ అనేకమంది భక్తులు ఉపవాసంతో మందిరంలో గడిపారు. అనంతరం శిలువ శాంతి యాత్ర నిర్వహించారు. పాటలు పాడుకుంటూ స్థానిక బస్టాండ్ సెంటర్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనేకమంది పాస్టర్లు, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

### వాడపల్లి వెంకన్న దేవస్థానానికి

# దాతల విరాళాలు



**అమలాపురం, ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు శు క్రవారం కృష్ణా జిల్లా పటమటకు చెందిన పాలడుగు రామనాధబాబు, వారి కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళంగా అందజేసారు. అలాగే వాడపల్లికి చెందిన సరిదే యరకయ్య, సూర్యకాంతం దంపతులు దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి రూ.30,116 విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం అనంతరం వేదాశీర్వచనం చేసారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది దాతలకు స్వామి వారి చిత్ర పటాలు అందజేసి సత్కరించారు.

### భక్తి శ్రద్ధలతో

# గుడ్ ఫ్రైడే..

**కోరుకొండ ఏప్రిల్ 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కోరుకొండ మండలంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శు క్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా కోరుకొండ మండలంలోని అన్ని చర్చిలలో తెల్లవారుజాము నుండి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కోరుకొండ పురవీధులలో ఆర్ సి ఎం రెవరెండ్ కే మాణిక్యం ఆధ్వర్యంలో క్రైస్తవులు క్రీస్తు సిలువ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ కే మాణిక్యం మాట్లాడుతూ సకల మానవాళి పాప పరిహారార్థమై యేసు క్రీస్తు సిలువ యాగం చేశారన్నారు. మానవులు ప్రతి ఒక్కరు శాంతి, సౌభ్రాతత్వంతో మెలగాలన్నారు. యేసు క్రీస్తు పలికిన ఏడు మాటలు జ్ఞాపకం చేసుకుంటూ ప్రతి క్రైస్తవుని ఇంట నిత్యం ఏసుక్రీస్తు ప్రార్థనతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపదేశులు బెల్లపు డేవిడ్,జ్ఞానేష్,సంఘపెద్దలు బూసి వసంతకుమార్,దారా భూషణం, అమ్మాజి,వరమ్మ,పైడాడ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి వేడిమిని తట్టుకోవాలంటే..
## ఈ 5 చల్లని డ్రింక్స్ తాగాల్సిందే




వేసవి వేడిమి పెరిగిపోతుంది నేపథ్యంలో ఉక్కపోత కూడా ఎక్కువ అవుతుంది దీంతో డిహైడ్రేషన్ కి గురవుతారు. వేసవి వేడిమి పెరిగిపోతుంది నేపథ్యంలో ఉక్కపోత కూడా ఎక్కువ అవుతుంది దీంతో డిహైడ్రేషన్ కి గురవుతారు. వేసవి వేయడమే తట్టుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తారు లేకపోతే డిహైడ్రేషన్ కి గురవుతారు ప్రధానంగా నీటిని ఎక్కువగా తీసుకోవాలి దీంతోపాటు కొన్ని రకాల డ్రింక్స్ డైట్ లో చేర్చుకోవడం వల్ల వేసవి వేడిమిని తరిమికొడుతుంది. ఆరెంజ్ జ్యూస్ వేసవి వేడిమిని తగ్గించుకోవాలంటే విటమిన్ సి పుష్కలంగా ఉండే ఆరెంజ్ జ్యూస్ తీసుకోవాలి ఇందులో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి ఇది మనకు తక్షణ శక్తిని కూడా అందించి మన శరీరాన్ని చల్లబరుస్తాయి రూపంలో తీసుకోవచ్చు. పుచ్చకాయ.. వేసవి వేడిమిని త్వరగా పారదోలేదు పుచ్చకాయ ఇందులో 95% కంటే నీరు ఎక్కువగా ఉంటుంది పుచ్చకాయ ఎండాకాలంలో విరివిగా లభిస్తుంది నేపథ్యంలో పుచ్చకాయని రెగ్యులర్గా తీసుకోవడం వల్ల మనకు సహజంగా ఎలక్ట్రోలైట్స్ అందుతాయి తద్వారా డిహైడ్రేషన్ గురు కాకుండా ఉంటారు. విటమిన్ ఏసి పుష్కలంగా ఉండే కర్బుజాని కూడా తీసుకోవటం వల్ల వేషం వేడిమి నుంచి మంచి ఉపశమనం లభిస్తుంది. ఇది షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది ఇందులో చర్మ ఆరోగ్యానికి మేలు చేసే గుణాలు కూడా ఉంటాయి వేసవి వేడిలో మంచి హైడ్రేషన్ అందిస్తుంది. బొప్పాయి.. బొప్పాయి పండు కూడా జీర్ణ ఆరోగ్యానికి మేలు చేస్తుంది వేసవి వేడి మీద వచ్చే జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది బొప్పాయి ఇమ్యూనిటీని తగ్గిస్తుంది ఇందులో విటమిన్స్ కూడా ఎక్కువ మోతాదులో ఉంటాయి ఇది మన శరీరానికి తక్షణ శక్తి అందిస్తుంది. పైనాపిల్ బ్రో మై లైన్ ఉంటుంది ఇందులో ఏంటి ఇంట్లో మీటరీ గుణాలు కలిగి ఉంటాయి దీని దగ్గర తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు కూడా తగ్గిపోతాయి పైనాపిల్ కూడా మంచి హైడ్రేషన్ అందిస్తుంది. ద్రాక్ష పండ్లలో కూడా ఎక్కువ మోతాదుల ఆంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి ఇది హైడ్రేషన్ అందిస్తుంది అంతేకాదు బి బ్లడ్ ప్రెషర్ ని కూడా తగ్గించ గుణాలు కలిగి ఉంటాయి ఈ ద్రాక్ష పండ్లను డైట్ లో చేర్చుకోవడం వల్ల కూడా మనకు ఎండాకాలంలో మంచి హైడ్రేషన్ అందించి శరీరాన్ని చల్లబరుస్తుంది.

# ఈ చేప తింటే సహజంగా.. కేవలం నెలలోనే
## బరువు తగ్గిపోతారు



ఈ చేప తింటే సహజంగా.. కేవలం నెలలోనే బరువు తగ్గిపోతారు బరువు తగ్గాలనుకొని చాలామంది అనుకుంటారు. ఇప్పుడు ఉన్న బిజీ లైఫ్ లో ఎక్కువ శాతం కూర్చొని పనిచేయటం ఇతర ఆరోగ్య సమస్యల వల్ల బరువు పెరిగిపోతారు. : బరువు తగ్గాలనుకొని చాలామంది అనుకుంటారు. ఇప్పుడు ఉన్న బిజీ లైఫ్‌లో ఎక్కువ శాతం కూర్చొని పనిచేయటం ఇతర ఆరోగ్య సమస్యల వల్ల బరువు పెరిగిపోతారు. అయితే చేప డైట్లో చేర్చుకుంటే బరువు ఇట్టే తగ్గిపోతారు.. చేపలో ప్రోటీన్స్, ఆరోగ్యకరమైన కొవ్వులు మన శరీరానికి కావాల్సిన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. తద్వారా కడుపు నిండిన అనుభూతి ఎక్కువ సమయం పాటు కలిగిస్తుంది. దీంతో బరువు పెరగకుండా ఉంటారు. సాల్మన్ చేపను తినడం వల్ల ఇందులో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ బరువు పెరగకుండా చేస్తాయి. అంతేకాదు ఇది గుండె ఆరోగ్యానికి కూడా మంచిది. బ్లడ్ ప్రెజర్ సమస్యను కూడా తగ్గించేస్తాయి. సాల్మన్ చేపలో ఉండే ప్రోటీన్ కడుపు నిండిన అనుభూతిని ఎక్కువ సమయం పాటు కల్పిస్తుంది. తద్వారా అతిగా తినకుండా ఉంటారు. ఇందులో ఓమేగా 3ఎస్ కూడా ఉంటుంది. ఇది మెటబాలిజం రేటు పెంచుతుంది. మేకరాల్ ఫిష్ తినడం కూడా మంచిది. ఇందులో కూడా ఒమేగా 3 ఎస్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇందులో కొవ్వు కరిగించే గుణాలు కూడా కలిగి ఉంటుంది. ఈ చేపలో ఉండే ప్రోటీన్ అతిగా ఆకలి వేయకుండా చేస్తుంది. ఈ మేకరల్ చేపలో విటమిన్ డి కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. క్యాలరీలు కూడా తక్కువ మోతాదులో ఉంటాయి. కాబట్టి వీటిని సులభంగా తినవచ్చు. ట్యూనా చేప తింటే కూడా బరువు తగ్గిపోతారు. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటుంది. ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. ట్యూనా సలాడ్ రూపంలో తీసుకోవచ్చు. శాండ్విచ్ మాదిరి తీసుకోవచ్చు. ఇందులో ప్రోటీన్ ఎక్కువ మోతాదులో ఉంటుంది. మెటబాలిజం రేటు పెంచుతుంది. అంతేకాదు ట్రౌట్ అనే ఫిష్ లో కూడా ఆరోగ్య ప్రయోజనాలు మెండుగా ఉంటాయి. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. తద్వారా బరువు తగ్గిపోతారు. ప్రధానంగా ఇందులో ఒమేగా 3ఎస్ ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ని కూడా తగ్గించేస్తుంది. బరువు నిర్వహణలో ఉన్న వాళ్ళు ట్రౌట్ చేపను తినాలి. ఇందులో మన శరీరాన్ని కావలసిన విటమిన్స్, ఖనిజాలు శరీర ఆరోగ్యానికి ప్రేరేపిస్తాయి. ఇది మాత్రమే కాదు హాలీ బటన్ చేప తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్యకరమైన కొవ్వులు ప్రోటీన్స్ ఉంటాయి. ఇది బరువు తగ్గించేస్తాయి. మన శరీరానికి కావాల్సిన మినరల్స్ ఉంటాయి. ఫ్యాట్ బర్నింగ్ గుణాలు కలిగి ఉండటం వల్ల ఈ చేప తీసుకుంటే కూడా బరువు పెరగకుండా ఉంటారు.


# సబ్జా నీళ్లు వేసవిలో మేలు



**వేసవిలో డీ హైడ్రేషన్ గురికావడం వల్ల నీరసం వస్తుంది. త్వరగా అలిసిపోవడం, చికాకుగా అనిపిస్తుంది. ఇంకా అనేక చర్మ సమస్యలు, జుట్టు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఈ సమస్యలన్నింటికీ సబ్జా గింజలు చక్కని పరిష్కారం చూపుతాయి. వీటిలో చాలా రకాల ప్రోటీన్స్ ఉన్నాయి.**

- సబ్జా గింజల్లో ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ వల్ల కడుపు నిండినట్లుగా అనిపిస్తుంది.
- సబ్జా గింజలను నిమ్మకాయ నీరు, షర్బత్, మిల్క్‌షేక్‌ల వంటి రిఫ్రెష్ డ్రింక్స్‌లలో వేసుకుని రోజుకు మూడు, నాలుగు గ్లాసులు తీసుకుంటే వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చు.
- సబ్జా గింజల్లో పీచు ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకం సమస్య నుంచి బయట పడొచ్చు. శరీరంలో ఉన్న వ్యర్థాలు కూడా బయటికి వెళ్లిపోతాయి. రక్తం శుద్ధి అవుతుంది. జీర్ణ సంబంధ సమస్యలైన కడుపు మంట, ఉబ్బరం, అసిడిటీ, అజీర్తి వంటి సమస్యలు తొలగిపోతాయి.
- సబ్జా గింజలను నూరి కొబ్బరి నూనెలో వేసి, ప్రభావిత ప్రాంతాలపై రాయడం వల్ల తామర, సోరియాసిస్ వంటి అనేక చర్మ వ్యాధుల చికిత్సకు సహాయ పడుతుంది.
- సబ్జా గింజలను నానబెట్టకుండా, నూరి ఒక కప్పు కొబ్బరి నూనెలో వేసి, కొన్ని నిమిషాలు పాటు వేడి చేసి అప్లై చేయాలి. చర్మం దెబ్బతిన్న చోట, కొత్త చర్మ కణాలను ఏర్పరుస్తుంది.
- సబ్జా గింజల్లో ఐరన్, విటమిన్ కె, ప్రోటీన్ ఉన్నాయి. ఇవి జుట్టుని బలంగా చేయడంలో తోడ్పడతాయి.
- చక్కెర వేయకుండా సబ్జా గింజల నీటిని తాగితే మధుమేహం అదుపులోకి వస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి.
- నానబెట్టిన సబ్జా గింజలను గ్లాసు పచ్చిపాలలో వేసుకొని, కొన్ని చుక్కల వెనిలా కలిపి తాగితే టైప్2 మధుమేహంతో బాధపడే వారికి ఉపశమనం కలుగుతుంది.
- సబ్జా గింజలలో యాంటిస్పాస్మోడిక్ ఉంటుంది. అంటే ఇవి స్పాస్మాటిక్ కండరాలలో ఉద్రిక్తతను తగ్గించి దగ్గును నియంత్రించడంలో సాయపడుతుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి.
- సబ్జా గింజల్లో ఉండే వైసెనిన్, ఓరింటిన్, బీటా కెరోటిన్ వంటి ఫ్లేవనాయిడ్స్ శరీర రక్షణ వ్యవస్థను బలపరుస్తాయి. కేవలం శరీరం లోపలి భాగాన్నే కాక బయట భాగాన్ని కూడా కాపాడటంలో ఇవి బాగా పనిచేస్తాయి.
- తలనొప్పి, మైగ్రేన్ లాంటి సమస్యలు ఉన్నవారు ఈ గింజల్ని నీళ్లలో కలుపుకొని తరుచూ తాగితే ఉపశమనం కలుగుతుంది.

# ఈత సరదా కానీ జాగ్రత్తలు తీసుకోకపోతే విషాదం



**ఈత అంటే ప్రతి ఒక్కరికి ఆసక్తి, సరదా అయితే ఈత వచ్చిన వారు, నేర్చుకునే వారు ప్రమాదాలు, వ్యాధులకు అవకాశం లేకుండా తగు జాగ్రత్తలు పాటించడం చాలా అవసరం. గ్రామాల్లో కుంటలు, చెరువులు, బావులు పట్టణ ప్రాంతాల్లో ఈత కొలనులో స్విమ్మింగ్? నేర్చుకునేందుకు పిల్లలు ఆసక్తి చూపిస్తారు. ఈత కొలను నిర్వహణకు ప్రభుత్వం ప్రమాణాలను, నిబంధనలను నిర్దేశించింది.**



### నిబంధనల సూచికలు ఏర్పాటు చేయాలి


చాలా ప్రాంతాల్లో ఈత కొలనుల నిర్వహణలో పూర్తి స్థాయి నిబంధనలు పాటించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈత కొలనుల పరిశుభ్రత, నీటి శుద్ధీకరణ, స్నానాల రూమ్? నిర్వహణ సక్రమంగా ఉండాలని, ప్రమాదాలకు అవకాశం లేకుండా నిబంధనల సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులు నిబంధనలు ఏర్పాటు చేశారు. అయితే చాలా చోట్ల రక్షణ పరికరాలు అందుబాటులో లేవు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన శిక్షకులు లేకపోగా, స్విమ్మింగ్ వచ్చిన స్థానికులతోనే వెళ్లదీస్తున్నారు. పూల్స్ వద్ద ప్రత్యేకంగా లైవ్‌గార్డ్సను ఏర్పాటు చేయాలి.

### ఈత సరదా కానీ జాగ్రత్తలు తీసుకోకపోతే విషాదం

ఇద్దరు లైవ్‌గార్డులు నిరంతర పర్యవేక్షణ స్విమ్మింగ్ పూల్? లోతు ఒక వైపు 3 అడుగులు, మరో వైపు అత్యధికంగా 5.5 అడుగులు మాత్రమే ఉండాలి. చర్మ సంబంధిత, ఇతర వ్యాధులకు అవకాశం లేకుండా ప్రమాణాల మేరకు స్విమ్మింగ్?లోని నీటిని ఆధునిక పరికరాల సహాయంతో నిరంతరం శుద్ధి చేయాలి. చెత్తా చెదారం నిత్యం తొలగించి నీటిని పరిశుభ్రంగా ఉంచాలి. స్విమ్మింగ్ పూల్?లో ప్రమాదాల బారిన పడకుండా నిబంధనలతో కూడిన బోర్డు, లేదా ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి. స్విమ్మింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి కలిగిన వారికి కనీస వయసు 8 సంవత్సరాలు ఉండాలి. 8 సంవత్సరాలలోపు వారికి ఎట్టి పరిస్థితిలోనూ ప్రవేశం కల్పించరాదు. జూనియర్ నేషనల్, సీనియర్ నేషనల్, స్కూల్ గేమ్స్ నేషనల్‌లో పాల్గొనడంతో పాటు, ఏడాది, లేదా ఆరు వారాల పాటు శిక్షణ పొంది డిప్లొమా ధ్రువపత్రం కలిగిన శిక్షకులు ఉండాలి. లైఫ్ జాకెట్లు ధరించిన ఇద్దరు లైవ్‌గార్డులు నిరంతర పర్యవేక్షణ చేయాలి.

# సమ్మర్ లో ఈ జాగ్రత్తలు తప్పనిసరి..
## లేదంటే డేంజర్

**వేసవి కాలంలో ఎండ తీవ్రత వల్ల డీహైడ్రేషన్, అలసట, చర్మ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు. ఇలాంటి సమయంలో కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటో ఇక్కడ తెలుసుకోండి. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా పెరగడం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఎండ తీవ్రత వల్ల డీహైడ్రేషన్, అలసట, చర్మ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు. అందుకే ఈ కాలంలో సరైన జీవనశైలి అలవాటు చేసుకోవాలి.**



### సరైన జీవనశైలి అలవాట్లు

వేసవిలో నీటిని ఎక్కువగా తీసుకోవడం చాలా అవసరం. రోజుకు కనీసం 3%-%4 లీటర్లు నీళ్లు తాగడం ద్వారా శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచవచ్చు. మజ్జిగ, కొబ్బరి నీరు, తాటిపండు, దోసకాయ వంటి తండ్రీ ఆహార పదార్థాలు శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. బహిరంగ ప్రదేశాలకు వెళ్లేటప్పుడు తెలుపు లేదా లేత రంగుల దుస్తులు ధరించడం మంచిది. టోపీలు, గ్లాసెస్ వంటివి వాడడం వలన ఎండ నుంచి రక్షణ లభిస్తుంది. సూర్యుడి కిరణాలు ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండటం ఆరోగ్యానికి మంచిది. ఉదయం లేదా సాయంత్రం మాత్రమే అవసరమైన పనుల కోసం బయటకు వెళ్లడం ఉత్తమం. వేసవిలో ఆహారం మితంగా తీసుకోవడం, పచ్చి కూరగాయలు, పండ్లు ఎక్కువగా తినడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను నియంత్రించవచ్చు. వేసవిని సురక్షితంగా, ఆరోగ్యంగా గడపాలంటే ఈ మార్పులు అనుసరించడం అవసరం.

**శరీరంలో నీటి కొరత ఉంటే ఈ రోగాలు చుట్టుముడతాయి.. జాగ్రత్త!**

### నిద్ర, విశ్రాంతి

వేసవిలో వేడి ప్రభావం శరీర శక్తిని తగ్గిస్తుంది. ఎక్కువ ఉష్ణోగ్రతల కారణంగా శరీరం త్వరగా అలసిపోతుంది. అలాంటి సమయంలో శరీరానికి తగిన విశ్రాంతి చాలా ముఖ్యం. ప్రతిరోజూ కనీసం 7%-%8 గంటల నిద్ర తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. తీవ్రమైన ఎండల సమయంలో ఎయిర్ కండిషనర్ లేదా ఫ్యాన్ ఉపయోగించడం వల్ల నిద్రలో అంతరాయం కలగదు. మధ్యాహ్న సమయంలో 15%-%30 నిమిషాలు విశ్రాంతి తీసుకోవడం శరీరాన్ని ఫ్రెష్‌గా ఉంచుతుంది. వేసవిలో ఎక్కువ పని చేయడం వల్ల తలనొప్పులు, నీరసం వంటి సమస్యలు ఎదురవుతాయి. వాటిని నివారించాలంటే తగినంత నిద్ర చాలా అవసరం. శరీరం మానసికంగా, శారీరకంగా రిఫ్రెష్ అవ్వాలంటే విశ్రాంతికి ప్రాధాన్యత ఇవ్వాలి. వేడి ప్రభావం తగ్గించడానికి గది శుభ్రంగా ఉంచడం, ప్రాపర్ వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. వేసవి కాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే నిద్ర, విశ్రాంతిని నిర్లక్ష్యం చేయకూడదు.



# తొలి సీజన్ మామిడి పండ్లు
## ఆరోగ్యానికి హానికరమా..?

**వేసవిలో మార్కెట్‌లోకి వచ్చే మామిడిపండ్లను సహజంగా పండించరు, కార్బైడ్ వంటి రసాయనాల సహాయంతో పండిస్తారు. కాల్షియం కార్బైడ్ ఒక విషపూరిత రసాయనంతో కలిసిన మామిడి పండ్లుతింటే ఆరోగ్యానికి హానికరం. ఇది కడుపు నొప్పి, నోటి పూతల వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుంది.వేసవి ప్రారంభం కాగానే మార్కెట్‌లోకి మామిడి పండ్లు ఎక్కువగా వస్తాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ వీటిని చాలా ఇష్టపడతారు. మామిడి పండ్ల తీపి, పుల్లని రుచి అందరికీ నచ్చుతుంది. కానీ పెద్దలు తరచుగా సీజన్ ప్రారంభంలో పండ్లను తినకూడదని చెబుతుంటారు. అది శరీరానికి హాని కలిగిస్తుందంటారు చెబుతారు. వేసవి ప్రారంభంలో మామిడి పండ్లు ఎక్కువగా తినటం సరైనదేనా..? కాదా..? అనేది ఈ ఆర్టికల్‌లో కొన్ని విషయాలు తెలుసుకుందాం.**

### ఆరోగ్యానికి హానికరం:

వేసవి సీజన్ ప్రారంభంలో మార్కెట్‌లోకి వచ్చే మామిడి పండ్లను సహజంగా పండించరు, కార్బైడ్ వంటి రసాయనాల సహాయంతో పండిస్తారు. కాల్షియం కార్బైడ్ ఒక విషపూరిత రసాయనంతో కలిసి ఉంటాయి. దీనివల్ల మామిడి పండ్లు త్వరగా పండుతాయి. కానీ దాని వినియోగం ఆరోగ్యానికి హానికరం. ఇది కడుపు నొప్పి, నోటి పూతల వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. రసాయనాలను ఉపయోగించి పండించిన మామిడి పండ్లు పూర్తిగా భిన్నంగా కనిపిస్తాయి. మామిడి పండ్లు కొనడానికి మార్కెట్‌కి వెళ్ళినప్పుడల్లా, చాలా మెరిసే, ఏకరీతి పసుపు రంగులో ఉండే పండిన మామిడి పండ్లను ఎప్పుడూ కొనవద్దు. ఈ రకమైన మామిడి పండ్లను రసాయనాలను ఉపయోగించి పండిస్తారు. దీనితోపాటు మామిడి చాలా త్వరగా మృదువుగా మారినా, రసాయన వాసన వస్తే, అందులో కార్బైడ్ ఉండవచ్చు.

### ముందుగా పండిన మామిడి పండ్లన్నీ చెడ్డవా?

ప్రతి కొత్త మామిడి తప్పనిసరిగా హానికరం కాదు. కొంతమంది రైతులు సహజంగా పండిన మామిడి పండ్లను కూడా మార్కెట్లో అమ్ముతారు. గడ్డి లేదా గడ్డిలో ఉంచి పండించిన మామిడి పండ్లు హానికరం కాదు. కానీ మార్కెట్లో త్వరగా డబ్బు సంపాదించాలనే రేసులో.. చాలా మంది వ్యాపారులు రసాయనాలను ఆశ్రయిస్తారు. ఎల్లప్పుడూ నమ్మదగిన మూలం నుంచి మామిడి పండ్లను కొనాలి. మామిడి కాయను ఇంటికి తెచ్చి కొన్ని గంటలు నీటిలో నానబెట్టాలి. ఇది బాహ్య రసాయనాల ప్రభావాన్ని తగ్గించవచ్చు. మే మధ్యలో లేదా మే చివరి నుండి మామిడి పండ్లను కొనడానికి ప్రయత్నించాలని నిపుణులు చెబుతున్నారు.

గమనిక: ఈ కథనం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రమే ఇచ్చినది. %=ఎ% దీనిని ధృవీకరించడం లేదు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన

# 22 మంది మావోయిస్టులు



ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అమానవీయ మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సెస్ (సీఆర్‌పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక, విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు.

లొంగిపోయిన వారిలో మావోయిస్టు మిలిటరీ డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా, స్క్వాడ్ సభ్యురాలు.. అతని భార్య ముచాకి జోగి ఉన్నారని, వీరిపై రూ.8 లక్షల రివార్డు ఉండగా.. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు దేవే, దుధి బుధ్రాలపై ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉందన్నారు. మరో ఏడుగురు కార్యకర్తలపై రూ.2 లక్షల రివార్డు, ఒకరిపై రూ.50వేలు రివార్డు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.50,000 సాయం అందించామని.. ప్రభుత్వ పునరావాస పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. గతేడాది సుక్మాతో సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా తుడిచిపెడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం పునరుద్ఘాటించిన నేపథ్యంలో మావోయిస్టుల లొంగుబాటు ప్రాధాన్యం సంతరించుకుంది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన సీఆర్పీఎఫ్ 86వ వ్యవస్థాపక దినోత్సవాల పరేడ్‌లో షా మాట్లాడుతూ.. మావోయిస్టులు లేని భారత్ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత మిషన్‌కు సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) వెన్నెముకగా నిలిచిందని ప్రశంసించారు. ఫలితంగా ఆ ప్రాంతాల్లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 70శాతానికి పైగా తగ్గి ఇప్పుడు ముగింపు దశకు చేరాయన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం కోసం ప్రత్యేక కోబ్రా దళాన్ని ఏర్పాటుచేశామన్నారు.

## రష్యాకు ఆయుధాలు.. జెలెన్‌స్కీ ఆరోపణలు అవాస్తవం: చైనా





ఉక్రెయిన్-రష్యా : రష్యాకు చైనా ఆయుధాలు, మందుగుండు సామగ్రి సమకూరుస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపణలు చేశారు. వీటిని చైనా తోసిపుచ్చింది. యుద్ధం ముగియాలని తాము బలంగా కోరుకుంటున్నామని, త్వరగా శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు చైనా విదేశాంగశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

ఉక్రెయిన్‌పై గత మూడేళ్లుగా యుద్ధం (%ఖఎతీఖఅవ జతీఅంఅం%) జరుగుతున్న వేళ రష్యాతో చైనా ఆర్థికంగా బలమైన సంబంధాలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ చైనాపై తీవ్ర ఆరోపణలు చేశారు. మాస్కోకు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని చైనా సమకూరుస్తోందని నేరుగా ఆరోపించారు. అదే సమయంలో రష్యా భూభాగంలో ఆయుధాలు కూడా తయారు చేస్తోందన్నారు. ఇలా బీజింగ్‌పై జెలెన్‌స్కీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారి. దీనిపై చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పందిస్తూ.. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై చైనా వైఖరి స్పష్టంగా ఉందన్నారు. నిరాధార, రాజకీయ ఉద్దేశాలను వ్యతిరేకిస్తున్నామని, రష్యా దిగుమతి చేసుకుంటున్న ఆయుధాల్లో ఎక్కువగా అమెరికా, పాశ్చాత్య దేశాలవేనని ఉక్రెయిన్ బహిరంగంగా చెప్పిందన్నారు. తాము ఎవరికీ మారణాయుధాలను సరఫరా చేయలేదన్నారు. యుద్ధం ముగియాలని కోరుకుంటున్నామని, కాల్పుల విరమణను ప్రోత్సహించడంతోపాటు శాంతి చర్చలకు సహకారం అందించేందుకు చైనా కట్టుబడి ఉందన్నారు.

## యూఎస్‌లో అత్యధికంగా

## భారతీయ విద్యార్థుల వీసాలు రద్దు: కాంగ్రెస్



దిల్లీ: అమెరికాలోని విదేశీ విద్యార్థుల వీసాలను ట్రంప్ యంత్రాంగం పెద్ద మొత్తంలో రద్దు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు 327 వీసా రద్దు కేసులు తమకు అందినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈవిషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు.

చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని వారి వీసాలు కూడా రద్దయినట్లు కళాశాలలు పేర్కొంటున్నాయి. వీసాల రద్దుకు అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని విద్యార్థులు వాపోయారు.

## బెంగాల్‌లో ఆందోళనలపై

## బంగ్లా వ్యాఖ్యలు.. తోసిపుచ్చిన భారత్



పశ్చిమ బెంగాల్ : వక్ఫ్ చట్టాని కి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్ లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనలపై బంగ్లాదేశ్ కు చెందిన ఒక అధికారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారతవిదేశాంగ శాఖ స్పందించింది. అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడానికి బదులు బంగ్లా తమ దేశంలోని మైనార్టీల హక్కులను కాపాడటంపై దృష్టి సారించాలని విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ హితవు పలికారు. విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈవిధంగా బదులిచ్చారు.

బెంగాల్‌లోని పరిస్థితులపై బంగ్లాదేశ్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం ఇటీవల మాట్లాడారు. భారత్‌లోని మైనారిటీలను రక్షించేందుకు అక్కడి కేంద్రంతో పాటు పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపైన తాజాగా జైస్వాల్ స్పందిస్తూ.. 'పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఘటనలకు సంబంధించి బంగ్లా అధికారులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. వారి వ్యాఖ్యలు అర్థరహితమైనవి. ఆ దేశంలోని మైనారిటీలపై జరుగుతున్న హింస గురించి భారత్ తన ఆందోళనను తెలుపుతోంది. ఈక్రమంలో వారు తిరిగి మాపై ఇలాంటి నిందలు వేయడం మానుకోవాలి. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి బదులు వారు తమ సొంత దేశంలో మైనారిటీల హక్కులను కాపాడటంపై దృష్టిసారిస్తే మంచిది' అని పేర్కొన్నారు.

వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హూగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈక్రమంలోనే ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పుపెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసం చోటుచేసుకుంది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. ఈ చట్టాన్ని బెంగాల్‌లో అమలుచేయబోమని పునరుద్ఘాటించారు. అయితే ఈ హింసలో ఉగ్రసంస్థల హస్తం ఉందని, వారే యువకులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేలా చేస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి.


తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
ఏప్రిల్ 19, శనివారం 2025


# అందులో బౌలర్ పొరపాటు ఏముంది?

## ముంబై-హైదరాబాద్ మ్యాచ్‌లో ఆసక్తికర ఘటన

- కీపర్ హెన్రిచ్ క్లాసెన్ అత్యుత్సాహం
- అందరూ ఆలోచించాలంటున్న వరుణ్ చక్రవర్తి

ఐపీఎల్ 2025లో భాగంగా గురువారం ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. సన్‌రైజర్స్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ అత్యుత్సాహం కారణంగా ముంబై ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ డగౌట్ చేరి మరీ.. మరలా మైదానంలోకి వచ్చి ఆడాడు. క్లాసెన్ గ్లవ్స్ స్టంప్స్ ముందుకు తీసుకురావడంతో థర్డ్ అంపైర్ నోబాల్‌గా ప్రకటించాడు. దాంతో జీషన్ అన్సారి బౌలింగ్‌లో క్యాచ్ అవుట్ అయిన రికెల్‌టన్‌కు అవకాశం దొరికింది. దీనిపై కోల్‌కతా నైట్ రైడర్స్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పందించాడు.



కీపర్ గ్లవ్స్ స్టంప్స్ ముందుకొస్తే బౌలర్ పొరపాటు ఏముంది? అని, దీనిపై అందరూ ఆలోచించాలని వరుణ్ చక్రవర్తి తన సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. 'ఒకవేళ వికెట్ కీపర్ గ్లవ్స్ స్టంప్స్ ముందుకొస్తే దానిని డెడ్ బాల్‌గా ప్రకటించాలి. కీపర్‌కు వార్నింగ్ ఇస్తూ.. మరోసారి ఇలా చేయకూడదని చెప్పాలి. బంతిని నో బాల్‌గా ప్రకటించడం, ఫ్రీహిట్ ఇవ్వడం సరైంది కాదు. ఇందులో బౌలర్ పొరపాటు ఏముంది. దీని గురించి నేను తీవ్రంగా ఆలోచిస్తున్నా. అందరూ ఆలోచించాలని కోరుకుంటున్నా' అని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు. మిస్టరీ స్పిన్నర్‌కు చాలా మంది సపోర్ట్ చేస్తున్నారు. ఎంసీసీ 27.3 కోడ్ ప్రకారం.. బంతి స్టంప్స్‌ను దాటేవరకూ వికెట్ కీపర్ చేతులు వెనకనే ఉండాలి.

# సంజు శాంసన్, ద్రవిడ్‌ల మధ్య లడాయి..

## సీఎస్కేకు వచ్చేయ్ అంటూ కామెంట్స్..

**రాజస్థాన్ రాయల్స్ జట్టులో అంతర్గత పోరు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ సంజూ శాంసన్‌ల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు నెట్టింట పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. దీనికి కారణం సూపర్ ఓవర్ ఫలితమని సమాచారం.ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి సూపర్ ఓవర్ రాజస్థాన్- ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగింది. ఈ సూపర్ ఓవర్‌లో బ్యాటింగ్ కు రియాన్ పరాగ్, హెట్‌మయెర్ తొలుత బ్యాటింగ్ కు వచ్చారు. ఆ తర్వాత యశస్వి జైస్వాల్‌ను రెండో వికెట్‌గా పంపించారు. ఇక, ఢిల్లీ బౌలర్ మిచెల్ స్టార్క్ అద్భుతమైన బౌలింగ్‌తో కేవలం 11 పరుగులే ఇచ్చాడు. ఛేజింగ్ లో కేఎల్ రాహుల్ (7), స్టబ్స్ (6) పరుగులు చేయడంతో ఢిల్లీ సూపర్ విక్టరీ సాధించింది.**



అయితే, సూపర్ ఓవర్‌కు ముందు కోచ్ రాహుల్ ద్రవిడ్ జట్టు సభ్యులతో మాట్లాడుతూ కనిపించాడు. ఈ మీటింగ్ కు కెప్టెన్ సంజూ శాంసన్ దూరంగా ఉన్నాడు.. దగ్గరకు రమ్మని పిలిచిన అతడు వెళ్లలేదు. రియాన్ పరాగ్ ను హైలెట్ చేయడానికే ద్రావిడ్ కష్టపడుతున్నాడు.. అందుకే సంజూని ఇలా అవమానిస్తున్నాడని సోషల్ మీడియాలో అతడి ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. ఇక, సంజూ శాంసన్ ను కెప్టెన్సీని వదిలేయమని సూచించడంతో పాటు జట్టును మారిపోవాలని వేడుకుంటున్నారు.

ఇక, రాహుల్ ద్రవిడ్‌తో సంజూ శాంసన్ కు ఎప్పుడూ సమస్యగానే ఉంది.. టీమిండియాలో ఉన్నప్పుడూ కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా సంజూ ఆ ఫ్రాంచైజీని వదిలేయ్.. అక్కడ విలువ లేనప్పుడు

# గుజరాత్ గూటికి శ్రీ లంక మాజీ కెప్టెన్




**ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025లో టేబుల్ సెకెండ్ టాపర్‌గా ఉన్న గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ గ్లెన్ ఫిలిప్స్ గాయపంతో టోర్నీ మొత్తానికి దూరం అయ్యాడు. ఇక, అతడికి ప్రత్యామ్నాయ ఆటగాడిగా శ్రీలంక పరిమిత ఓవర్ల మాజీ కెప్టెన్ దసున్ షనకను తీసుకుంది. అయితే, షనక 2023 సీజన్‌లో కూడా గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సీజన్ మెగా వేలంలో అతడు అన్ సోల్డ్ ప్లేయర్ గా మిగిలిపోయినప్పటికీ.. ఫిలిప్స్ గాయపడటంతో షనకను 75 లక్షలకు కొనుగోలు చేసింది గుజరాత్.**

కాగా, దసుక షనక త్వరలోనే గుజరాత్ టైటాన్స్‌తో జతకట్టనున్నాడు. ఇక, 2023 సీజన్‌లో గుజరాత్ తరఫున 3 మ్యాచ్‌లు ఆడిన షనక కేవలం 26 పరుగులే చేశాడు. ఆల్‌రౌండర్ అయిన అతడు ఆ సీజన్‌లో బౌలింగ్ చేసే ఛాన్స్ రాలేదు. అయితే, ఈ ఏడాది ఇంటర్నేషనల్ టీ20 లీగ్ (దుబాయ్) టైటిల్ గెలిచిన దుబాయ్ క్యాపిటల్స్ జట్టులో షనక సభ్యుడిగా ఉన్నాడు. కాగా, శ్రీలంక తరఫున 6 టెస్టులు, 71 వన్డేలు, 102 టీ20లు ఆడిన షనక.. టెస్టుల్లో ఓ హాఫ్ సెంచరీతో పాటు 13 వికెట్లు తీసుకోగా.. వన్డేల్లో 2 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలు, 27 వికెట్లు ఉన్నాయి. ఇక, టీ20ల్లో 5 హాఫ్ సెంచరీలు, 33 వికెట్లు తీసుకున్నాడు. అలాగే, దసున్ షనక వన్డేల్లో ఒకసారి ఐదు వికెట్లు కూడా తీసుకున్నాడు.

# మెరిసిన జాక్స్, రికిల్‌టన్..

## సన్‌రైజర్స్‌పై ముంబై విజయం!



సొంతగడ్డపై బంతితో, బ్యాటుతో అదరగొట్టిన ముంబై ఇండియన్స్ మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఐపీఎల్ 2025లో భాగంగా గురువారం వాంఖడే స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 4 వికెట్ల తేడాతో గెలిచింది. 163 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో మూడో విజయాన్ని అందుకుని ప్లేఆఫ్స్ రేసులో ఉంది. మరోవైపు ఆడిన 7 మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించిన సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ చేరడం దాదాపుగా కష్టమే.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 5 వికెట్లకు 162 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (40బీ 28 బంతుల్లో 7ఐ4), హెన్రిచ్ క్లాసెన్ (37బీ 28 బంతుల్లో 3ఐ4, 2ఐ6) రాణించారు. ట్రావిస్ హెడ్ (28) నెమ్మదిగా ఆడగా, ఇషాన్ కిషన్ (2) మరోసారి విఫలమయ్యాడు. తెలుగు ఆటగాడు నితీశ్ రెడ్డి (19) ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఇన్నింగ్స్ చివరలో అనికేత్ (18 నాటౌట్), ప్యాట్ కమిన్స్ (8 నాటౌట్) దూకుడుగా ఆడి స్కోరు 160 దాటించారు. ముంబై బౌలర్లు విల్ జాక్స్ (2/14), జస్ప్రీత్ బుమ్రా (1/21), ట్రెంట్ బౌల్ట్ (1/29)లు హైదరాబాద్ బ్యాటర్లను కట్టడి చేశారు.

ముంబై 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విల్ జాక్స్ (36బీ 26 బంతుల్లో 3ఐ4, 2ఐ6), రికిల్‌టన్ (31బీ 23 బంతుల్లో 5ఐ4) మెరుపులు మెరిపించారు. రోహిత్ శర్మ (26బీ 16 బంతుల్లో 3ఐ6) దూకుడుగా ఆడాడు. రికిల్‌టన్, రోహిత్ అనంతరం సూర్య కుమార్ యాదవ్ (26బీ 15 బంతుల్లో 2ఐ4, 2ఐ6) స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముంబై తేలిగ్గా విజయం అందుకుంటుందనుకుంటుండగా.. సూర్య, జాక్స్‌ను కమిన్స్ స్వల్ప వ్యవధిలో ఔట్ చేశాడు. హార్దిక్ పాండ్యా (21బీ 9 బంతుల్లో 3ఐ4, 1ఐ6), తిలక్‌వర్మ (21 నాటౌట్‌బీ 17 బంతుల్లో 2ఐ4) పని పూర్తి చేశారు.

# లక్నో సూపర్ జెయింట్స్‌కు గుడ్‌న్యూస్

## లక్నో జట్టులో చేరిన పేస్ సంచలనం మయాంక్ యాదవ్



లక్నో సూపర్ జెయింట్స్‌కు గుడ్‌న్యూస్. పేస్ సంచలనం మయాంక్ యాదవ్ ఎట్టకేలకు ఫిట్‌నెస్ సాధించి జట్టుతో కలిశాడు. శనివారం (ఏప్రిల్ 19) రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో మయాంక్ ఆడే అవకాశం ఉంది. మయాంక్ రాకతో లక్నో బౌలింగ్ బలం మరింత పెరిగింది. పేసర్లు శార్దూల్ ఠాకూర్, ఆకాష్ దీప్, అవేశ్ ఖాన్‌లకు మయాంక్ తోడవ్వనున్నాడు. మయాంక్ తుది జట్టులోకి వస్తే.. భారీగా పరుగులు సమర్పించుకుంటున్న శార్దూల్‌పై వేటు పడే అవకాశాలు ఉన్నాయి. 2024 ఐపీఎల్‌లో లక్నో తరఫున ఆడిన మయాంక్ యాదవ్.. బుల్లెట్ లాంటి బంతులతో అందరిని ఆకట్టుకున్నాడు. నిలకడగా 150 కిలోమీటర్ల వేగంతో బంతులేశాడు. అయితే గాయం కారణంగా నాలుగు మ్యాచ్‌లే ఆడి ఏడు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో మయాంక్‌ను రూ.11 కోట్లకు లక్నో రిటైన్ చేసుకుంది. ఇటీవలి గాయాల నుంచి కోలుకున్న మయాంక్.. ఐపీఎల్ 2025లో ఆడేందుకు సిద్ధమవుతుండగా మునివేళ్లకు గాయమైంది. మరలా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లి తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. మయాంక్ రాకతో లక్నో ఫాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ 2025లో లక్నో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడి.. నాలుగు విజయాలు, మూడు ఓటములను ఎదుర్కొంది.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# 'థగ్ లైఫ్' చిత్రబృందం ముచ్చట్లు




%కమల్ హాసన్ ప్రధాన పాత్రలో మణిరత్నం తెరకెక్కిస్తోన్న చిత్రం 'థగ్ లైఫ్'. జూన్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. త్రిష, అభిరామి హీరోయిన్లు. తాజాగా ఈ సినిమా నుంచి తొలిపాటను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో చిత్రబృందం సినిమా విశేషాలు ముచ్చటించారు. కమల్ హాసన్ మాట్లాడుతూ '37 ఏళ్ల క్రితం నేను మణిరత్నం దర్శకత్వంలో 'నాయకన్'లో నటించాను. ఆయన అప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలానే ఉన్నారు. ఏమాత్రం మార్పు రాలేదు. అది ఆయన గొప్పతనం. మేమిద్దరం కథ గురించి చర్చించుకునే సమయంలో 25 శాతం సినిమా అయిపోయినట్లు ఉంటుంది. ఏఆర్ రెహమాన్ సంగీతం ఎప్పుడూ నా మనసుకు దగ్గరగా ఉంటుంది. ఇండిస్ట్రీలో శింబు లాంటి వ్యక్తి చాలా అరుదుగా ఉంటారు. తను నా స్నేహితుడు అని చెప్పడానికి గర్వపడుతున్నా. ఈ సినిమాలో భాగమైన అందరికీ కృతజ్ఞతలు. భారతీయ సినీ పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందుతోంది. 45 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు ఎంతో మార్పు వచ్చింది' అన్నారు. మణిరత్నం మాట్లాడుతూ 'ఎన్నో ఏళ్ల తర్వాత కమల్‌హాసన్‌తో వర్క్ చేసే అవకాశం వచ్చింది. ఆయన గొప్ప నటుడని అందరికీ తెలిసిందే. సినిమాను ప్రేమిస్తారు. తన నటనతో ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకొని సినిమాలకు సరిహద్దులు ఉండవని నిరూపించారు. షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాం' అన్నారు. 'ఈ చిత్రంలో అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. కమల్‌హాసన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని త్రిష చెప్పారు. 'కమల్ హాసన్ %-% మణిరత్నంలది హిట్ కాంబో. ఈ సినిమాలోని పాటల్లో ఒక మేజిక్ ఉంది. 4 నెలల నుంచి ఈ సినిమా పనుల్లో పూర్తిగా నిమగమై ఉన్నాం. ఈ పాటలు మీరంతా ఎప్పుడెప్పుడు వింటారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని ఏఆర్ రెహమాన్ మాట్లాడారు.






## ఏప్రిల్ 26న ఒక్కడు, భరత్ అనే నేను

# మూవీ రీ రిలీజ్

ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో ఎక్కడ చూసిన రీ రిలీజ్ హంగామా కనిపిస్తుంది. టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో భారీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. చివరిగా బాబు డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలోని 'గుంటూరు కారం' చిత్రంతో థియేటర్లలో సందడి చేశారు. అయితే నెక్ట్స్ జక్కన్న డైరెక్షన్ లో నటిస్తున్న ఎస్ఎస్ఎమ్ బి 29 చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందో పక్కాగా తెలియని పరిస్థితి. ఇక మహేశ్ బాబును మళ్లీ థియేటర్లలో చూడాలంటే అభిమానులు చాలా కాలం ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోఅభిమానులకు గుడ్ న్యూస్ అందింది. ఎస్-ఎస్ఎంబీ29 కంటే ముందే థియేటర్లలో సందడి చేయబోతున్నారు. మహేశ్ బాబు కెరీయర్ లోని హిట్ చిత్రాలను రీ రిలీజ్ చేయబోతున్నారు. ఇప్పటికే టాలీవుడ్ లో రీ రిలీజ్ ల ట్రెండ్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మహేశ్ బాబు బ్లాక్ బాస్టర్ ఫిల్మ్ 'పోకిరి', అలాగే సూపర్ హిట్ ఫిల్మ్ 'బిజినెస్ మ్యాన్' చిత్రాలు రీరిలీజ్ అయ్యి థియేటర్లలో సందడి చేసిన సంగతి తెలిసిందే. రీ రిలీజ్ ల్లోనూ ఈ చిత్రాలు మంచి వసూళ్లను రాబట్టాయి. మరికొద్ది నెలల్లో మహేశ్ బాబు పుట్టిన రోజు ఉన్నందున ముందేగానే రీరిలీజ్ ల పర్వం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఏకంగా మహేశ్ బాబు కెరీర్ లో మంచి విజయాన్ని సాధించిన 4 చిత్రాలను రీ రిలీజ్ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. తాజాగా ఆ రీరిలీజ్ సినిమాలకు సంబంధించిన విడుదల తేదీలను కూడా ఫిక్స్ చేశారు. కాగా మొదట మహేశ్ బాబు గుణశేఖర్ కాంబినేషన్ లో వచ్చిన బ్లాక్ బాస్టర్ ఫిల్మ్ 'ఒక్కడు' రీ రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 26న విడుదల చేయబోతున్నారు. అదే రోజు న ఏప్రిల్ 26ననే మహేశ్ బాబు మరో బ్లాక్ బాస్టర్ చిత్రం 'భరత్ అనే నేను' చిత్రం కూడా రీ రిలీజ్ కాబోతుండటం విశేషం. ఇలా ఒకే రోజు రెండు చిత్రాలను రీ రిలీజ్ చేస్తూ థియేటర్లలో దుమ్ములేపోతున్నారు ఫ్యాన్స్. ఇప్పటికే రీ రిలీజ్ కు సంబంధించిన ఏర్పాట్లలో ఉన్నారు. ఆగస్టు 9న మహేశ్ బాబు పుట్టిన రోజు సందర్భంగా బాబు కెరీయర్ లో ఆల్ టైమ్ ఫేవరెట్ మూవీ 'అతడు' చిత్రం రీ రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాకు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఇలా ఈ ఏడాది మహేశ్ బాబు అభిమానులు బ్యాక్ టు బ్యాక్ రీరిలీజ్ లతో ఫుల్ ఎంటర్ టైన్ లభించనుంది. బాబును థియేటర్లలో చూసుకునే అవకాశం ఇలా దక్కడం విశేషం. ఇదిలా ఉంటే మహేశ్ బాబు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్ లో ఎస్ఎస్ఎంబీ29 చిత్రం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. నెక్ట్స్ షెడ్యూల్ ఇటలీలో జరగనుంది. 3000 మంది ఆర్టిస్టులతో భారీ బోట్ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేయబోతున్నారట.

# ప్రాణహాని ఉందని లావణ్య ఆరోపణ



%హైదరాబాద్ నగరానికి చెందిన నటుడు రాజ్ తరుణ్, లావణ్యల మధ్య కొనసాగుతున్న గొడవ మళ్లీ ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా మౌనంగా ఉన్న ఈ వివాదం బుధవారం నాడు మళ్లీ రక్తి కట్టించింది. నటి లావణ్య నివాసమున్న కోకాపేట్ ఇంటికి బుధవారం మధ్యాహ్నం రాజ్ తరుణ్ తల్లిదండ్రులు, వారి అనుచరులు వచ్చినట్లు తెలుస్తోంది. వారు ఇంటి గేట్ వద్ద హల్‌చల్ చేయడంతో పాటు, లావణ్య ఇంట్లోకి ప్రవేశించి సీసీ కెమెరాలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ సమయంలో లావణ్యను ఇంటి నుండి బయటకు లాగేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అదేవిధంగా, ఆమెకు అడ్డుగా వచ్చిన సోదరుడిపై కూడా దాడి చేశారని ఆమె ఆరోపించారు. ఈ ఘటనలో %ఋయ ఖతీబఅ% తల్లిదండ్రులు, అతడి అనుచరులు గురువారం తెల్లవారుజామున వరకూ లావణ్య ఇంటి వద్దే ఉండిపోయారు. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. చివరికి లావణ్య అంగీకరించడంతో రాజ్ తరుణ్ తల్లిదండ్రులను ఆమె తిరిగి ఇంట్లోకి అనుమతించింది. గురువారం నాడు లావణ్య నార్సింగి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసింది. తనపై దాడి జరిగిందని, మొత్తం 15 మంది రౌడీలను రాజ్ తరుణ్ ప్రేరేపించాడని ఆమె ఆరోపించింది. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. మీడియాతో మాట్లాడిన లావణ్య %-% "నేను రాజ్‌కు క్షమాపణలు చెప్పాను. గొడవలు వద్దు అనుకున్నా. కానీ ఆయన మాత్రం నన్ను వదిలించుకోవాలని కుట్రలు చేస్తూ నా మీద దాడులకు పాల్పడుతున్నాడు" అని ఆవేదన వ్యక్తం చేసింది. %ఋయ ఖతీబఅ% తనపై ప్రాణహాని కలిగించేలా ప్రవర్తిస్తున్నాడని, తనకు పోలీసులు రక్షణ కల్పించాలంటూ ఆమె విజ్ఞప్తి చేసింది. "ఇది పంచాయితీ విషయం కాదు. చట్టపరంగా ఆయనను కోర్టులోకి ఈడుస్తాను. అవసరమైతే శైలుకు పంపిస్తాను" అంటూ ఆమె ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంటికి వచ్చిన వ్యక్తుల అనుమతులు, సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.



## నా పేరుతో ఉత్తరాఖండ్‌లో

# గుడి ఉంది..


## ఊర్వశీ రౌతేలా

బాలీవుడ్ గ్లామర్ డాల్ ఊర్వశీ రౌతేలా మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశీ రౌతేలా మాట్లాడుతూ, "ఉత్తరాఖండ్‌లో నా పేరు మీద ఓ గుడి ఉంది. బద్రీనాథ్‌కు ఎవరైనా వెళితే, పక్కనే ఉన్న నా గుడిని చూడండి. అక్కడి వెళ్లి సందర్శించండి. ఢిల్లీ యూనివర్సిటీలోనూ నా ఫొటోలకు పూలమాలలు వేసి పూజిస్తారు. నన్ను 'దండమమాయి' అని పిలుస్తారు కూడా. ఈ విషయం తెలిసిన తరువాత నేను చాలా ఆశ్చర్యపోయాను. కానీ ఇది నిజం. దీనిపై చాలా వార్తా కథనాలు కూడా ఉన్నాయి. కావాలంటే మీరంతా వార్తా కథనాలను చదవచ్చు.'టాలీవుడ్ అగ్ర హీరోలు మెగాస్టార్? చిరంజీవి, నటరత్న బాలకృష్ణలతో కలిసి నటించాను. దక్షిణాదిలో కూడా నాకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. అందుకే దక్షిణ భారతదేశంలోనూ నా కోసం ఓ ఆలయాన్ని నిర్మించాలని ఆశిస్తున్నా' అని ఊర్వశీ అన్నారు. మరి మీ గుడికి వచ్చినవారు మీ ఆశీర్వాదం తీసుకుంటారా? అని యాంకర్ అడగ్గా, అది ఆలయమని, అన్ని ఆలయాల్లో ఏమేమి జరుగుతాయో అక్కడ కూడా అవే జరుగుతాయని ఊర్వశి తెలిపారు. ఈ వీడియో చూసిన నెటిజన్‌లు 'ఆమె పూర్తిగా భ్రమలో మునిగిపోయింది' అని సరదాగా కామెంట్స్ పెడుతున్నారు. ఆ మధ్య సైఫ్ అలీఖాన్ ఇంట్లో దుండగుడి దాడి ఘటన సమయంలో మీడియా ప్రతినిధులు ప్రశ్నలు వేస్తుంటే తన వేలికున్న డైమండ్ రింగ్ చూపిస్తూ తెగ షో చేసింది. దీనిపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో చివరికి సారీ చెప్పింది. సంక్రాంతికి వచ్చిన 'డాకు మహరాజ్'తో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించడంతో పాటు ఓ సాంగ్‌లో బాలయ్యతో 'హే దబిడి దిబిడి దబిడి దిబిడి నువ్ దంచు దంచు బాల' అంటూ సాంగ్‌లో రెచ్చిపోయింది. ఈ సాంగ్‌లో ఇద్దరి మధ్య కొన్ని స్టెప్పులు తీవ్ర విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. 'డాకు మహరాజ్' హిట్ అయ్యింది. ఇటీవలే విడుదలై బాలీవుడ్‌లో దుమ్ములేపుతోన్న సన్నీ డియోల్ 'జాట్' సినిమాలో ఐటెమ్ సాంగ్‌లో రచ్చ చేసింది ఈ భామ. 'సింగ్ సాబ్ ది గ్రేట్' చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైన ఊర్వశి రౌతెలాకు పెద్దగా అవకాశాలు రాలేదు. దీంతో రూటు మార్చి ఐటెమ్ గర్ల్ అవతారమెత్తింది. అలా తెలుగులో చిరంజీవి పక్కన ' వాల్తేరు వీరయ్య', పవన్ కళ్యాణ్ 'బ్రో', అఖిల్ ' ఏజెంట్', రామ్ పోతినేని 'స్కంద' చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో నర్తించింది. ఇక బాలయ్య, బాబీ కాంబినేషన్లో ఈ సంక్రాంతికి వచ్చిన 'ఢాకు మహరాజ్'తో ఆమెకు కీలక పాత్ర నటించింది. పోలీస్ ఆఫీసర్‌గా యాక్షన్ సన్నివేశాల్లో నటించి మెప్పించడంతో పాటు బాలకృష్ణతో సాంగ్‌తో ఇరగదీసింది. అయితే అవకాశాల కోసమే ఊర్వశి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలవడానికి ప్రయత్నిస్తుందంటూ నెటిజన్లు విమర్శిస్తున్నారు.౦౦

## మంచు లక్ష్మి ఫ్యాషన్ షోలో

# మెరిసిన అరవింద్

### నటి మంచు లక్ష్మి ఆధ్వర్యంలో 'టీచ్ ఫర్ చేంజ్' ఫ్యాషన్ షో



హైదరాబాద్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీ వేదికగా ఇటీవల నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేకంగా అద్భుతమైన అనుభవాన్ని అందించింది. ఈ వేడుక నిర్వహణలో నటి మరియు నిర్మాత మంచు లక్ష్మి ప్రత్యేకంగా నటించింది. ఆమె ఆధ్వర్యంలో 'టీచ్ ఫర్ చేంజ్' సంస్థ ఒక సంచలన కార్యాచరణ ప్రారంభించింది. ఈ ఫ్యాషన్ షో ద్వారా యువతకు నైతిక, సామాజిక అవగాహనను పెంపొందించే ఉద్దేశ్యంతో దాతృత్వం మరియు ఫ్యాషన్‌ను కలిసి ప్రదర్శించడానికి గట్టి ప్రయత్నాలు చేపడుతూ, ఈ సమాజాన్ని మార్పు కరకంగా ప్రేరేపించే అవకాశం తీసుకువచ్చింది. ఈ ఫ్యాషన్ షోలో యువ కథానాయకుడు అరవింద్ కృష్ణ తన ప్రత్యేక సొగసుతో ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించాడు. ఆత్మవిశ్వాసంతో కూడిన తన ర్యాంప్ వాక్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఉత్సాహపూరితంగా నడిచిన అరవింద్ తన శైలితో ఈ వేడుకకు ప్రత్యేక శోభను తెచ్చాడు. అతని ప్రదర్శన ఈ కార్యక్రమానికి అదనపు ఘనతను తీసుకువచ్చింది. ర్యాంప్ పై నడిచిన ప్రతి కదలిక కూడా ఎంతో ప్రత్యేకమైనది. ఎనోభావాలను మారుస్తూ, అభివృద్ధికి దారి తీసే ప్రయత్నాలతో 'టీచ్ ఫర్ చేంజ్' సంస్థ ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థ విద్యారంగం లో పెద్ద మార్పులు తీసుకురావడానికి దోహదం చేసే దాతృత్వ కార్యక్రమాలను నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుంది. అలా, ఫ్యాషన్ షో మాత్రమే కాకుండా, సమాజంలో మార్పు చేయడం కూడా వీరి ప్రధాన ప్రాధాన్యత. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఆర్థికంగా సహాయం చేయడం, అలాగే సమాజంలోని పేదరికాన్ని తగ్గించడానికి ముఖ్యమైన అంశాలను ప్రాధాన్యం ఇచ్చారు. మన సమాజంలో యువత మరింత ఉత్తమంగా ప్రవర్తించడానికి, తాము చేయగలిగే మార్పులను అర్థం చేసుకోవడం ద్వారా సమాజంలో ఎంతో మంచి చేయవచ్చు అని తెలియజేయడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఈ ఫ్యాషన్ షోలో మరింత స్పెషల్‌గా, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం, ఆర్థిక మరియు సామాజిక చైతన్యం కోసం జరిగినప్పటికీ, మెరుగైన నైపుణ్యం, ఉత్సాహం, గ్లామర్‌ను జోడించింది. అరవింద్ కృష్ణ రాక, ఈవెంట్‌లో దాని సొగసును మరింత పెంచింది. ఇప్పుడు అరవింద్ కృష్ణ సినిమా రంగంలో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసులను గెలుచుకోవడంలో గట్టిగా ముందుకు పోతున్నాడు. ఇతని కృషి, ప్రతిభ, మరియు నైపుణ్యం సినిమాల్లో అదనపు వెలుగును పంచుకుంటున్నాయి. ఇప్పుడు అతను పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. ఏదైనా కొత్త ప్రాజెక్టులో అతను చూపించనున్న నైపుణ్యం మరియు ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను మెప్పించేలా ఉండే అవకాశం ఉంది. ఈ ఈవెంట్ ఈ సంవత్సరంలో మరింత ప్రాముఖ్యతను సొంతం చేసుకుంది, ఎందుకంటే ఇది సమాజానికి సంబంధించి అత్యంత కీలకమైన మెసేజ్‌ని అందించింది. ప్రతి ఒక్కరు తమలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో సామాజిక బాధ్యతను నిర్వర్తించాలనుకుంటే, మార్పు తలపడుతుంది. అలాగే, దాతృత్వానికి, ఫ్యాషన్‌లో కూడా ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా, మన సమాజం మరింత సానుకూలంగా మారుతుంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339